# పతాకం న్యూస్

APTEL/25/A2082

PATHAKAM NEWS TELEGU DAILY // తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 195 | విశాఖపట్నం | 16-4-2026 గురువారం | చీఫ్ ఎడిటర్ : ఎల్. కృష్ణరావు | పేజీలు: 8 | వెల: రూ.5/-

Volume : 01 | Issue : 195 | VISAKHAPATNAM | 16-4-2026 THURSDAY | CHIEF EDITOR: L.KRISHNA RAO | Pages:8 | Rate: Rs.5/-

Visakhapatnam, Srikakulam, Allurisitarama, Rajamahendravaram, Vijayawada, Tirupati, Anathapuram



SBI

PATHAKAM NEWS

SCAN & PAY

UPI ID: 44576280686@sbi

BHIM | UPI

yono SBI | BHIM SBI Pay

G Pay | Paytm | Pay




2లో

**కూటమి పాలనలో మత్స్యకారులకు అన్యాయం: జగన్**



5లో

**కొత్త పెన్షన్ కోసం ప్రజల ఎదురుచూపులు!**



6లో

**రోజంతా కళ్లద్దాలు పెట్టుకోవటం మంచిదేనా?**



# నిర్మించిన కొద్ది రోజులకే వర్షాలకు కొట్టుకుపోయిన రోడ్లు!

**అనకాపల్లి, పతాకం న్యూస్:** గిరిజన గ్రామాలకు రవాణా సదుపాయం కోసం రహదారుల నిర్మాణం పేరుతో ఖర్చు చేస్తున్న ఉపాధి హామీ నిధులు వృథా అవుతున్నాయి. సంబంధిత శాఖల ఉన్నతాధికారుల పర్యవేక్షణలోపం, క్షేత్రస్థాయిలో పనులు చేయించే ఇంజనీర్ల అవినీతి కారణంగా గిరిజన ప్రాంతాల్లో నిర్మిస్తున్న రోడ్లు నాణ్యత లేమితో మూన్నాళ్ల ముచ్చటగా మారుతున్నాయి. ఏడాది తిరగకుండానే ఆనవాళు లేకుండా వర్షాలకు కొట్టుకుపోతున్నాయి. రోలుగుంట, రావికమతం మండలాల్లో ఏజెన్సీ ప్రాంతానికి ఆనుకొని వున్న మారుమూల గిరిజన గ్రామాలకు రహదారుల నిర్మాణం కోసం ప్రభుత్వం 2024 డిసెంబరులో రూ.6.6 కోట్ల మేర ఉపాధి హామీపథకం నిధులు మంజూరు చేసింది. రోలుగుంట మండలం అర్ల గ్రామం నుంచి పిత్రిగెడ్డ వరకు సుమారు ఆరు కిలోమీటర్ల మేర మెటల్ రోడ్డు వేసి, తరువాత దానిపై తారు రోడ్డు నిర్మించడానికి రూ.4.1 కోట్లు, వైబీ పట్నం నుంచి లోసింగి వరకు సుమారు మూడు కిలోమీటర్ల మేర మెటల్ రోడ్డు వేసి, దానిపై తారు రోడ్డు నిర్మించడానికి రూ.2.5 కోట్లు ప్రభుత్వం కేటాయించింది. అర్ల నుంచి పిత్రిగెడ్డ వరకు సుమారు కోటి రూపాయల వ్యయంతో గత ఏడాది మార్చిచివరి నాటికి మట్టి రోడ్డు పనులను పూర్తిచేశారు. తరువాత బీటీ రోడ్డు వేయాలి. కానీ గత ఏడాది జూన్‌లో కురిసిన వర్షాలకు మెటల్‌తోసహా రోడ్డు మొత్తం కొట్టుకుపోయింది. అప్పటి వరకు సుమారు కోటి రూపాయల విలువైన పనులు చేయగా, కాంట్రాక్టర్‌కు రూ.50 లక్షల మేర బిల్లు చెల్లించినట్టు తెలిసింది. వైబీపట్నం నుంచి లోసింగి వరకు మూడు కిలోమీటర్ల మేర గ్రావెల్, మెటల్‌తో రోడ్డు నిర్మించారు. నాలుగుచోట్ల కల్వర్టులు నిర్మించి వదిలేశారు. ఈ రోడ్డు కూడా గత ఏడాది వర్షాలకు పూర్తిగా కొట్టుకుపోయింది. పీఆర్ ఇంజనీరింగ్ విభాగం అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో రహదారి నిర్మాణ పనుల్లో నాణ్యత లోపించింది. ఈ రోడ్డు పనులకు సంబంధించి సుమారు రూ.30 లక్షల మేర కాంట్రాక్టర్‌కు బిల్లు చెల్లించినట్టు తెలిసింది. వర్షాలకు రోడ్లు కొట్టుకుపోయిన తరువాత కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించడం పలు అనుమానాలకు తావిస్తున్నది. ఈ విషయంలో కాంట్రాక్టర్ల నుంచి పీఆర్ ఇంజనీర్లు భారీగానే కమీషన్లు పుచ్చుకున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇదిలావుండగా గత ఏడాది వర్షాలకు కొట్టుకుపోయిన అర్ల-పత్రిగెడ్డ, వైబీపట్నం-లోసింగి రోడ్ల నిర్మాణం కోసం పీఆర్, డ్వామా అధికారులు కొత్తగా ప్రతిపాదనలు పంపినట్టు తెలిసింది. నిబంధనల ప్రకారం గతంలో పనులు చేపట్టిన కాంట్రాక్టర్లచేతనే మిగిలిన పనులు పూర్తిచేయాలి. అంతవరకు టెండర్ అగ్రిమెంట్ అమల్లో వుంటుంది. కానీ అధికారులు ఈ నిబంధనలను తుంగలో తొక్కి, కొత్తగా ప్రతిపాదనలు తయారు చేశారు.

# గ్యాస్ సిలిండర్లు పేలి ఐదుగురు మృతి

- **20 మందికి తీవ్రగాయాలు.. వీరిలో 12 మంది పరిస్థితి విషమం**



**శ్రీ సత్యసాయి జిల్లా, పతాకం న్యూస్:** శ్రీ సత్యసాయి జిల్లాలో విషాదం చోటు చేసుకుంది. కదిరి మండలం కుమ్మరవాండ్లపల్లిలో ఒక్కసారిగా అలజడి రేగింది. భూమి కంపించినట్లు, ఆకాశం విరిగిపడినట్లు భారీ శబ్దంతో డిటోనేటర్లు పేలాయి. ఆ ఘటనతో ఆ ప్రాంతమంతా ఒక్కసారిగా అరుపులు, కేకలతో దద్దరిల్లింది. తీరా చూస్తే రెప్పపాటులో నలుగురు మాంసం ముద్దలుగా మారారు. 21 మంది తీవ్రంగా గాయపడ్డారు. సత్యసాయి జిల్లాలో తీవ్ర విషాదం నెలకొంది. కుమ్మరవాండ్లపల్లిలో ఓ ఇంట్లో భారీ శబ్ధంతో డిటోనేటర్లు పేలాయి. పేలుడు తీవ్రతకు ఇంటి గోడలు పగిలిపోయాయి. చుట్టుపక్కల నివాసాలు దెబ్బతిన్నాయి. ఆ ఇంట్లో ఉన్న వారు ఏం జరిగింతో (తరువాయి 2వ పేజీలో)



**అండమాన్ సముద్రంలో పడవ బోల్తా 250 మంది గల్లంతు**

4లో

## నేడు పార్లమెంటు ముందుకు

# మహిళా, డీ లిమిటేషన్ బిల్లులు



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** మహిళా రిజర్వేషన్, నియోజకవర్గాల పునర్విభజన బిల్లులను పార్లమెంటులో ప్రవేశపెట్టడానికి రంగం సిద్ధమైంది. గురువారం జరగనున్న ప్రత్యేక పార్లమెంటు సమావేశంలో ఈ బిల్లులను కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టనుంది. ఈ మేరకు పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంగళవారం ఎంపీలకు సమాచారం ఇవ్వడంతోపాటు, బిల్లు ప్రతులను వారికి పంపింది. నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించిన బిల్లులోని అంశాల ప్రకారం ప్రస్తుతం లోక్‌సభలో ఉన్న 543 స్థానాలు 850కి చేరనున్నాయి. రాష్ట్రాల్లో 815కు లోక్‌సభ స్థానాలు చేరుతాయని, కేంద్ర పాలిత ప్రాంతాల్లో 35 వరకు పెరిగే అవకాశం ఉందని సమాచారం. నియెజకవర్గాల పునర్విభజన కోసం 2011 జనాభా లెక్కలను కేంద్రం పరిగణనలోకి తీసుకుంది. మహిళా రిజర్వేషన్, నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించి ప్రతిపక్షాల డిమాండ్లను, చేసిన సూచనలను కేంద్రప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదు. ఈ నేపధ్యంలో బిల్లుల ఆమోద ప్రక్రియలో భాగంగా తప్పనిసరిగా చేయాల్సివున్న రాజ్యాంగ సవరణ అంశం ఆసక్తికరంగా మారింది. దీనికోసం రాజ్యంగ (131వ సవరణ) బిల్లు - 2026ను కేంద్ర ప్రభుత్వం (తరువాయి 2వ పేజీలో)

## అమరావతి పేరును ఆంగ్లంలో రాసేటప్పుడు ఉన్న గందరగోళానికి తెరదించిన ప్రభుత్వం



**అమరావతి, పతాకం న్యూస్:** ఆంధ్ర ప్రదేశ్ రాజధాని అమరావతి పేరును ఆంగ్లంలో రాసేటప్పుడు ఇప్పటివరకు ఉన్న గందరగోళానికి ప్రభుత్వం తెర దించింది. స్పెల్లింగ్ విషయంలో స్పష్టత నిస్తూ రాష్ట్ర ప్రభుత్వం కీలక ఉత్తర్వు జారీ చేసింది. ప్రభుత్వ పరిపాలనలో రాజధాని పేరును ఏకరూపంగా వాడేలా అధికారులు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. (తరువాయి 2వ పేజీలో)


పతాకం న్యూస్

APTEL/25/A2082

PATHAKAM NEWS TELEGU DAILY | తెలుగు దినపత్రిక

ధర్మం కోసం పోరాటం చేస్తున్నా..

అవినీతి, అక్రమాలను బయటకు తీస్తున్నా..

పతాకం న్యూస్‌కు సహకరించగలరు

సంవత్సరం చందా రూ. 2000

PATHAKAM NEWS

State Bank of India

A/c No: 44576280686

IFSC:SBIN00021297

DUVVADA BRANCH


## ఏపీలో ఇంటర్ ఫలితాలు విడుదల

**ఫలితాల్లో అబ్బాయిల కంటే అమ్మాయిలే టాప్**



2లో





## నీటి భద్రత కోసం 'జలధార' యాక్షన్ ప్లాన్

**సీఎం చంద్రబాబు ఆదేశాలు**

2లో

APTEL/25/A2082
పతాకం న్యూస్
PATHAKAM NEWS TELEGU DAILY // తెలుగు దినపత్రిక

# సంపాదకీయం

## కపట నీతి..!

చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించే చట్టాన్ని సవరించేందుకు పార్లమెంటు ప్రత్యేక సమావేశాన్ని అయిదు రాష్ట్రాల అసెంబ్లీలకు ఎన్నికలు జరుగుతున్న సమయంలో ఏర్పాటు చేయడం కమలనాథుల కపట నీతికి నిదర్శనం. ఉభయ సభల సభ్యులు ఎన్నికల్లో తలమునకలైవున్న సందర్భంలోనే ఈ ప్రత్యేక సమావేశం జరపాలనడం సర్కారుకు ఆ రిజర్వేషన్లపట్ల చిత్తశుద్ధి వున్నట్టు కాదు. నిజంగానే మహిళలకు 33 శాతం రిజర్వేషన్లను 2029 ఎన్నికల్లోనే అమలు చేయాలని నరేంద్ర మోడీ సర్కారు అభిమతమైతే ఆ బిల్లు ఆమోదించిన 2023 సెప్టెంబర్ లోనే ఆ పని చేసివుండవచ్చు. కానీ అప్పుడు తాజా జనాభా లెక్కల ప్రాతిపదికపై డీలిమిటేషన్ జరిపాకనే కొత్త చట్టం అమలు చేస్తామని చెప్పినది ఈ పాలకులే కదా! చట్టాన్ని వెంటనే అమలు చేయాలని ఆనాడు ప్రతిపక్షాలు పట్టుబట్టినా పాలక పార్టీ అందుకు తిరస్కరించింది కదా! అంతేగాక ఆనాడు జనగణన, డీలిమిటేషన్ గురించి అంత గట్టిగా చెప్పినవారు ఇప్పటివరకు ఆ పని పూర్తి చేయనేలేదు. దాదాపు మూడేళ్లవుతున్నా డీలిమిటేషన్ కమిషన్ ను నియమించలేదు. జనగణన పూర్తి స్థాయిలో ప్రారంభమే కాలేదు. అవేమీ చేయకుండా ఇప్పుడు పార్లమెంటు ప్రత్యేక సమావేశం అంటున్నారంటే హఠాత్తుగా వారికేమైనా బోధివృక్షం కింద జ్ఞానోదయం జరిగిందా! ఏతావాతా పరిశీలిస్తే జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికల్లో పాలక ఎన్డిఎ, దాని మిత్రులు రాజకీయ లబ్ధి పొందడం కోసమే ఇదంతా చేస్తున్నారని స్పష్టమవుతోంది. మహిళా రిజర్వేషన్ చట్ట సవరణ బిల్లుకు మద్దతు ఇవ్వాలని కోరుతూ అన్ని పార్టీల ఫ్లోర్ లీడర్లకు ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఆదివారంనాడు లేఖ రాయడం మరో విచిత్రం! 2029 లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలు మహిళా రిజర్వేషన్‌తో నిర్వహించడం అనివార్యమని లేఖలో ప్రధాని పేర్కొన్నారు. ఏప్రిల్ 16 నుంచి పార్లమెంటులో మహిళా రిజర్వేషన్ బిల్లుపై చర్చ ప్రారంభించనున్నట్టు వివరించారు. 'మహిళా రిజర్వేషన్ చట్ట సవరణ బిల్లును ఆమోదించే విషయంలో అందరూ ఒకేతాటిపైకి రావాలని కోరేందుకు ఈ లేఖ రాస్తున్నాను. వ్యక్తులు, పార్టీలకు అతీతంగా, మహిళలు, భవిష్యత్తు తరాల పట్ల బాధ్యతను చాటుకునే సందర్భమిది.' అని మోడీ లేఖలో పేర్కొనడం సరే! కేంద్ర ప్రభుత్వం అన్ని రాజకీయ పార్టీలతో సంప్రదింపులు జరిపిందని ప్రధాని ప్రస్తావించినా అది నిజం కాదని కాంగ్రెస్ నేత మల్లికార్జున ఖర్గే పేర్కొన్నారు. మహిళా రిజర్వేషన్ల బిల్లు విషయంలో ప్రతిపక్షాలకు అనేక అభ్యంతరాలున్నప్పటికీ బాధ్యతాయుతంగా వ్యవహరించడంతో 2023లో ఏకగ్రీవంగా ఆమోదం పొందిన విషయం మరువరాదు. మహిళా రిజర్వేషన్ చట్ట అమలుకు సంబంధించిన విషయాలు చర్చించేందుకు అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని ప్రతిపక్షాలు కోరుతున్నా ప్రభుత్వం ఇప్పటివరకు ఆ పని చేయలేదు. మరోవైపున 2011 జనాభా ప్రకారం డీలిమిటేషన్ చేయాలనీ, నియోజకవర్గాల సంఖ్య పెంచాలనీ ప్రభుత్వం సరికొత్త ప్రతిపాదనలను ముందుకు తేవడం అభ్యంతరకరం. నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించిన ఎలాంటి వివరాలు వెల్లడించకుండా వాటిని ఏ ప్రాతిపదికన చేస్తారో వివరించకుండానే ఎకాయెకిన చట్ట సవరణకు పూనుకోవడం సర్కారుకు తగని పని. మహిళా రిజర్వేషన్ ప్రక్రియకు జనగణన, నియోజకవర్గాల పునర్విభజన అంశాలతో ముడిపెట్టకుండానే అమలు చేయాలి. ఎందుకంటే నియోజకవర్గాల పెంపు విషయంలో వివిధ రాష్ట్రాలకు అభ్యంతరాలుండడం సహజం. అంతేగాక జనాభా వృద్ధిరేటు విషయంలోనూ రాష్ట్రాల మధ్య చాలా తేడాలున్నాయి. ఇటువంటి అనేక చిక్కులు తలెత్తుతాయి. అసెంబ్లీల ఎన్నికల ఫలితాలు మే నాలుగున వచ్చినా పోలింగ్ ప్రక్రియ ఏప్రిల్ 29తో ముగుస్తుంది. కాబట్టి ఆ తేదీ తరువాత ప్రభుత్వం అఖిలపక్ష సమావేశం నిర్వహించి అన్ని వివరాలు వెల్లడించి రాజకీయ పక్షాల మధ్య ఏకాభిప్రాయం సాధించాలి. అలాగే రాష్ట్ర అసెంబ్లీల నియోజకవర్గాల విభజన, సంఖ్యను పెంచడం వంటి ప్రతిపాదనలున్నందున రాష్ట్ర ప్రభుత్వాలతోనూ సంప్రదింపులు జరపాలి. విస్తృత చర్చల అనంతరం ఏకాభిప్రాయం ద్వారా మహిళా రిజర్వేషన్లను అమలు చేయాలి. సంకుచిత రాజకీయ ప్రయోజనాల కోసం కాకుండా విశాల సమాజ హితం కోసం కేంద్ర ప్రభుత్వం కృషి చేయాలి. అందుకు ప్రజా ఒత్తిడి అవసరం.

# నీటి భద్రత కోసం 'జలధార' యాక్షన్ ప్లాన్

## సీఎం చంద్రబాబు ఆదేశాలు



**అమరావతి, పతాకం న్యూస్:** రాష్ట్రంలో నీటి భద్రతకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని, పోలవరం ప్రాజెక్టు పూర్తయ్యాక గోదావరి జలాలను ఎలా వినియోగించుకోవాలో స్పష్టమైన 'జలధార యాక్షన్ ప్లాన్' సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. కుడి, ఎడమ కాలువలకు అనుసంధానంగా ఉన్న రిజర్వాయర్లు, చెరువులను నింపేలా ప్రణాళిక రూపొందించాలని సూచించారు. బుధవారం తన క్యాంపు కార్యాలయంలో జలవనరుల శాఖపై ఆయన సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. పోలవరం, వెలిగొండ, హంద్రీనీవా సహా పలు కీలక ప్రాజెక్టుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. పోలవరం ప్రాజెక్టును ప్రముఖ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని, హోటళ్లు, షాపింగ్ ఏరియాలతో పాటు పోలవరం-పాపికొండలు-భద్రాచలం మార్గంలో బోటింగ్ సౌకర్యం కల్పించాలని సీఎం సూచించారు. గోదావరి పుష్కరాల నాటికి ప్రాజెక్టును ప్రారంభించేలా పనులు వేగవంతం చేయాలన్నారు. ప్రాజెక్టులో కీలకమైన ఈసీఆర్ఎఫ్ డ్యామ్ గ్యాప్ 1, 2 పనులను వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తి చేయాలని నిర్దేశించారు. పునరావాస పనులను వేగవంతం చేసి, నిర్వాసితుల తరలింపును నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఇప్పటివరకు ప్రాజెక్టుకు రూ.27,089 కోట్లు ఖర్చు కాగా, మిగిలిన పనులకు మరో రూ.5,108 కోట్లు అవసరమని అధికారులు వివరించారు. రాయలసీమ, ప్రకాశం జిల్లాలకు జీవనాడి అయిన వెలిగొండ ప్రాజెక్టు స్టేజ్-1 పనులను జూన్ నెలాఖరు నాటికి పూర్తి చేయాలని సీఎం లక్ష్యంగా నిర్దేశించారు. హంద్రీనీవా ద్వారా ఇప్పటివరకు 52 టీఎంసీల నీటిని రాయలసీమకు తరలించినట్లు అధికారులు తెలిపారు. ఉత్తరాంధ్ర ప్రాజెక్టుల పనులు వేగవంతం చేయాలని, వంశధార నదిపై ప్రతిష్ఠాత్మకమైన నేరడి బ్యారేజ్‌కు అడ్డంకులు తొలగినందున వెంటనే టెండర్లు పిలవాలని ఆదేశించారు. చింతలపూడి ఎత్తిపోతల పథకం, వరికెపుడిశెల ప్రాజెక్టు పనులనూ ముందుకు తీసుకెళ్లాలన్నారు. పోలవరం-నల్లమల సాగర్ అనుసంధానానికి సంబంధించిన డీపీఆర్‌కు త్వరగా ఆమోదం పొందేలా చూడాలని సూచించారు. రాష్ట్రంలో చేపట్టిన జల సంరక్షణ చర్యల వల్ల భూగర్భ జలాలు గణనీయంగా పెరిగాయని అధికారులు సీఎంకు తెలిపారు. గతేడాది ఏప్రిల్‌తో పోలిస్తే ఈ ఏడాది 0.79 మీటర్ల మేర భూగర్భ జలాలు పెరిగాయని వివరించారు. గత ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురై నిర్వీర్యమైన లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలను పునరుద్ధరించేందుకు త్వరగా టెండర్లు పిలవాలని చంద్రబాబు ఆదేశించారు. ఈ సమీక్షలో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఏపీలో ఇంటర్ ఫలితాలు విడుదల

## ఫలితాల్లో అబ్బాయిల కంటే అమ్మాయిలే టాప్



**అమరావతి, పతాకం న్యూస్:** ఏపీ ఇంటర్ ఫలితాలు విడుదలయ్యాయి. బుధవారం ఉదయం మంత్రి నారా లోకేశ్ ఫలితాలను విడుదల చేశారు. ఈ ఏడాది ఇంటర్ ఫలితాల్లో రికార్డు స్థాయిలో ఉత్తీర్ణత నమోదు అయ్యింది. గత 12 ఏళ్లలో అత్యధికంగా మొదటి సంవత్సరం విద్యార్థులు 77 శాతం పాస్ అయ్యారు. రెండో సంవత్సరం విద్యార్థులు 81 శాతం పాస్‌తో రెండో అత్యుత్తమ ఫలితాలను సాధించారు. విద్యార్థులు తమ ఫలితాలను వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చు. 'Hi' మెసేజ్‌ను 9552300009 నంబర్‌కు వాట్సాప్‌లో పంపితే కూడా ఫలితాలు అందుబాటులో ఉంటాయి. ప్రభుత్వ, ప్రభుత్వ ఆధీన కళాశాలల్లో ఈ ఏడాది మెరుగైన ఫలితాలు వచ్చాయి. గవర్నమెంట్ జూనియర్ కాలేజీల్లో మొదటి సంవత్సరం 54 శాతం ఉత్తీర్ణత నమోదైంది. రెండో సంవత్సరం జీజేసీల్లో 68 శాతం పాస్ అయ్యారు. ఇది గత 12 ఏళ్లలో అత్యధిక ఉత్తీర్ణతగా నమోదు అయింది. విద్యార్థులు, ప్రిన్సిపల్స్, లెక్చరర్ల సమిష్ఠి కృషి వల్లే ఈ ఫలితాలు వచ్చాయని అధికారులు తెలిపారు. అకడమిక్ ఎక్సలెన్స్ కోసం అందరూ కలిసి కృషి చేయడం ఫలించిందని ప్రశంసించారు.

# నారా రామ్మూర్తినాయుడు స్పోర్ట్స్ సెంటర్‌ను ప్రారంభించిన మంత్రి లోకేష్



**తిరుపతి, పతాకం న్యూస్:** తిరుపతి జిల్లా చంద్రగిరిలో క్రీడా సంబరం నెలకొంది. ముఖ్యమంత్రి చంద్రబాబు సోదరుడు, నారా రామ్మూర్తినాయుడు స్మారకార్థం నిర్మించిన క్రీడా వికాస కేంద్రాన్ని రాష్ట్ర ఐటీ, విద్య శాఖల మంత్రి లోకేష్ బుధవారం ఘనంగా ప్రారంభించారు. చంద్రగిరి ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఈ కేంద్రాన్ని ప్రారంభించిన లోకేష్ ... ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారులు పీవీ సింధు, కిదాంబి శ్రీకాంత్‌తో కలిసి కాసేపు బ్యాడ్మింటన్ ఆడి సందడి చేశారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన మంత్రి లోకేష్ కు హాకీ క్రీడాకారులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆయన నారా రామ్మూర్తినాయుడు మల్టీ పర్పస్ ఇండోర్ స్టేడియం శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన ప్రాంగణంలోని క్రీడా సౌకర్యాలను పరిశీలించారు. చిన్నారులతో టేబుల్ టెన్నిస్, హాకీ ఆడుతూ వారిలో ఉత్సాహం నింపారు.

# కూటమి పాలనలో మత్స్యకారులకు అన్యాయం: జగన్



**నెల్లూరు, పతాకం న్యూస్:** మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత జగన్ ఏపీలోని కూటమి ప్రభుత్వంపై, సీఎం చంద్రబాబుపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలో ప్రస్తుతం పాలన అన్యాయంగా సాగుతోందని, దేవుడు అన్నీ చూస్తున్నాడని వ్యాఖ్యానించారు. కళ్లు మూసుకుని తెరిచేలోపు మళ్లీ మన ప్రభుత్వం వస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. నెల్లూరు జిల్లా పర్యటనలో భాగంగా ఆయన జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక మత్స్యకారులతో ముఖాముఖి నిర్వహించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తమ ప్రభుత్వ హయాంలో మత్స్యకారుల సంక్షేమానికి పెద్దపీట వేశామని జగన్ గుర్తుచేశారు. రాష్ట్రంలో రూ.26 వేల కోట్లతో నాలుగు కొత్త పోర్టులు, 10 ఫిషింగ్ హార్బర్లు, ఆరు ఫిష్ ల్యాండింగ్ సెంటర్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. మచిలీపట్నం, మూలపేట పోర్టుల పనులు 35 శాతం పూర్తి చేశామని, రామాయపట్నం పోర్టు పనులు దాదాపు పూర్తయ్యాయని వివరించారు. 2024 మార్చి 12న తాము జువ్వలదిన్నె హార్బర్‌ను వర్చువల్‌గా ప్రారంభించామని, కానీ నేటికీ దానిని మత్స్యకారులకు ఎందుకు అప్పగించలేదని కూటమి ప్రభుత్వాన్ని జగన్ ప్రశ్నించారు. చంద్రబాబు ప్రభుత్వం మత్స్యకారులకు మేలు చేయకపోగా, వారి పొట్ట కొడుతోందని విమర్శించారు. జువ్వలదిన్నె నుంచి మత్స్యకారులను తరిమివేసేందుకు కుట్ర జరుగుతోందని ఆరోపించారు. మార్చి 12న నారా లోకేశ్ జువ్వలదిన్నెను సందర్శించగా, 16న ఇక్కడ సీజ్ చేసిన బోట్లు ఎత్తుకెళ్లిపోయారని జగన్ ఆరోపించారు. అధికారంలో ఉన్న పెద్దలే ఈ దొంగతనం చేశారని, అందుకే ఒక్కరినీ అరెస్టు చేయలేదని అన్నారు. బోట్లు ఎత్తుకెళ్లేవారికి ముఖ్యమంత్రి కొడుకు ఆశీస్సులు ఉన్నాయని సంచలన వ్యాఖ్యలు చేశారు. మూడేళ్లు కళ్లు మూసి తెరిచేలోగా గడిచిపోతాయని, ఆ తర్వాత వచ్చేది తమ ప్రభుత్వమేనని జగన్ ధీమా వ్యక్తం చేశారు. తాము అధికారంలోకి రాగానే ప్రైవేట్ డిఫెన్స్ కంపెనీని ఇక్కడి నుంచి తరలిస్తామని హామీ ఇచ్చారు. ఫిషింగ్ హార్బర్లు మత్స్యకారుల హక్కు అని, వాటిని చంద్రబాబు తాత కూడా వారి నుంచి తీసుకోలేరని జగన్ స్పష్టం చేశారు.

(మొదటిపేజీ తరువాయి)

# మహిళా, డీ లిమిటేషన్ బిల్లులు

తీసుకువస్తోంది. అయితే, ఇది ఆమోదం పొందడానికి అవసరమైన మెజార్టీ మార్కుకు ఎన్డిఎ దూరంగా ఉండటమే దీనికి కారణం. రాజ్యాంగంలోని ఆర్టికల్ 368 ప్రకారం రాజ్యాంగ సవరణకు సభలో హాజరై ఓటువేసే సభ్యులలో రెండింట మూడో వంతు మంది మద్దతు తెలపడం తప్పనిసరి. దీని ప్రకారం ప్రస్తుత లోక్‌సభలో 540 మంది సభ్యులుండగా, వీరందరూ హాజరై ఓటు వేస్తే కనీసం 360 ఓట్లు అనుకూలంగా రావాల్సి ఉంది. అయితే, ప్రస్తుతం ఎన్డిఎ కూటమికి 293 మంది సభ్యులు మాత్రమే ఉన్నారు. దీంతో అవసరమైన మెజార్టీ మార్కుకు ఎన్డిఎ ఎలా చేరుకుంటుందన్నది ఆసక్తికరంగా మారింది. దీంతో బుధవారం జరగనున్న ఇండియా వేదిక సమావేశం ప్రాధాన్యత నంతరించుకుంది. కాంగ్రెస్ అధ్యక్షుడు, రాజ్యసభ ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే నివాసంలో ఈ భేటీ జరగనుంది. బిల్లులో ప్రతిపాదించిన అంశాలపై చర్చించనున్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన నియోజకవర్గాల పునర్ విభజన బిల్లుపై తీవ్ర స్థాయిలో విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కాంగ్రెస్, డిఎంకె, తృణమూల్ కాంగ్రెస్, వామపక్షాలతో కలిపి మొత్తం 152 మంది ఎంపీలు తీవ్ర అభ్యంతరాలను తెలియజేసినట్లు సమాచారం. ఎన్డిఎలో కూడా కొంత అసంతృప్తి కనిపిస్తోంది. మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం కోసం తెలుగుదేశం పార్టీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రంలోని వివిధ రాజకీయ పార్టీల నేతలకు లేఖలు రాశారు. అదే సమయంలో ఆయన పునర్ విభజన బిల్లు అంశాన్ని నామమాత్రంగా కూడా ప్రస్తావించలేదు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్ల దక్షిణాదికి తీవ్ర నష్టం జరిగే అవకాశం ఉండటంతో ఈ విషయంలో ఆచితూచి వ్యవహరించాలని భావిస్తున్నట్లు సమాచారం. దక్షిణాది రాష్ట్రాలకు భారీ నష్టం జరుగుతుందన్న నేపథ్యంలో 16 మంది ఎంపిలున్న టిడిపితో పాటు వైసిపి కూడా ఎలా వ్యవహరిస్తుందన్నది చర్చనీయాంశంగా మారింది. ఇప్పటి వరకు ఈ రెండు పార్టీలు రాష్ట్రంలో దుమ్మెత్తి పోసుకున్నా కేంద్రంలో మోడీ సర్కారుకు అనుకూలంగా వ్యవహరిస్తున్న సంగతి తెలిసిందే. మరోవైపు తమిళనాడులోని డిఎంకె పార్టీ ఈ బిల్లును తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. దీనికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నిరసనలు చేపడతామని, ద్రవిడ ఉద్యమం నాటి రోజులను గుర్తుకు తీసుకొస్తామని ఆ పార్టీ అధినేత, ముఖ్యమంత్రి స్టాలిన్ హెచ్చరించారు. తృణమూల్ కాంగ్రెస్ నేత డెరిక్ ఓబెరిన్ పునర్విభజన బిల్లుకు ఆమోదం పొందడం కోసమే మహిళా రిజర్వేషన్ బిల్లును కేంద్రం తీసుకొస్తోందని వ్యాఖ్యానించారు. అదే సమయంలో ఈ ప్రక్రియలో పెద్ద ఎత్తున లబ్ధిపొందే అవకాశం ఉన్న ఉత్తరప్రదేశ్‌కు చెందిన సమాజ్‌వాద్ పార్టీ ఎటువంటి వైఖరి తీసుకుంటుందన్నది కూడా ఆసక్తికరంగా మారింది. ఆ పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ 'జనగణన చేయకుండా పునర్విభజన ఎలా చేస్తారు?' అని ప్రశ్నించారు. అదే సమయంలో మహిళా రిజర్వేషన్ బిల్లుకు ఆయన మద్దతు ప్రకటించారు.

# గ్యాస్ సిలిండర్లు పేలి నలుగురు మృతి

తెలుసుకునేలోపే నలుగురు రెప్పపాటులో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మరో 21మంది తీవ్రంగా గాయపడ్డారు. పేలుడుతో ఆ ప్రాంతంలో భీతావహ వాతావరణం నెలకొంది. నివాసంలో ఓ కూలీ డిటోనేటర్లు నిల్వ ఉంచినట్లు, అవి పేలడం వల్ల చుట్టుపక్కల భవనాలు దెబ్బతిన్నాయి. నివాసాల్లో ఉన్న గ్యాస్ సిలిండర్లకు మంటలు అంటుకొని సిలిండర్లు సైతం పేలాయి. భారీగా మంటలు సైతం ఎగిసి పడ్డాయి. ప్రమాదంలో గాయపడిన 21 మందిని స్థానికులు హుటాహుటిన ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వీరిలో 12 మంది పరిస్థితి విషమం ఉన్నట్లు వైద్యులు తెలిపారు. మృతుల్లో ముగ్గురు కుమ్మరవాండ్లపల్లికు చెందిన మహబూన్నీసా, పి.విశ్వనాథ్‌రెడ్డి, మధుసూదన్‌గా గుర్తించారు. ఒకరు కదిరికి చెందిన అస్లాం బాషాగా తేల్చారు.

# అమరావతి పేరును ఆంగ్లంలో రాసేటప్పుడు ఉన్న గందరగోళానికి తెరదించిన ప్రభుత్వం

అమరావతి ఇక నుంచి Amaravathi(Thi) కి బదులుగా Amaravati(Ti) అని మాత్రమే రాయాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. ప్రభుత్వానికి సంబంధించిన అన్ని ఉత్తర్వులు (జీవోలు), ఫైళ్లు, నోట్ షీట్లలో రాజధాని పేరును కచ్చితంగా 'అమరావతి'గానే పేర్కొనాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆదేశించారు. అన్ని జిల్లాల కలెక్టర్లు, శాఖాధిపతులు, సచివాలయ విభాగాలు ఈ కొత్త మార్పును తక్షణమే అమల్లోకి తీసుకురావాలని ప్రభుత్వం సూచించింది.

# అధ్వానంగా ఉన్న చీడిపల్లి- చల్దిగెడ్డ మార్గం..



**కొయ్యూరు, పతాకం న్యూస్:** మండలంలోని బోడిదేముడుమెట్ట నుంచి పోకలపాలెం వరకు రహదారి నిర్మాణ పనులు రెండేళ్ల క్రితం నిలిచిపోవడంతో వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. గత ప్రభుత్వంలో బిల్లులు సక్రమంగా మంజూరుకాక పోవడంతో కాంట్రాక్టర్ చేతు లెత్తేయడం వలన ఈ రహదారి అసంపూర్తిగా దర్శనమిస్తోంది. మండలంలోని బూదరాళ్ల పంచాయతీ బోడిదేముడుమెట్ట నుంచి పోకలపాలెం వరకు కొత్తపల్లి, చల్దిగెడ్డ, చీడిపల్లి, పోకలపాలెం గ్రామాలను కలుపుతూ సుమారు నాలుగు కిలోమీటర్ల మేర బీటీ రోడ్డు నిర్మాణానికి 2024లో గత వైసీపీ ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. దీంతో గిరిజన సంక్షేమశాఖ ఇంజనీరింగ్ విభాగం అధికారుల పర్యవేక్షణలో రహదారి నిర్మాణంలో భాగంగా కాంట్రాక్టర్ మట్టి పనులు చేశారు. ఇంకా కల్వర్టులు నిర్మించాల్సి ఉంది. అయితే బిల్లులు సక్రమంగా మంజూరుకాకపోవడంతో కాంట్రాక్టర్ పనులను నిలిపివేశారు. కాగా రెండేళ్లుగా కురుస్తున్న వర్షాలకు బోడిదేముడుమెట్ట నుంచి పోకలపాలెం వరకు పలుచోట్ల మట్టి కోతకు గురై రాకపోకలకు ఇబ్బందిగా మారింది. వర్షా కాలం వస్తే రహదారి పూర్తిగా బురదమయంగా మారి నడిచి వెళ్లినా మోకాలు లోతు దిగబడిపోతుంది. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి ఈ రహదారి నిర్మాణాన్ని పూర్తి చేయాలని నాలుగు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

## సోలార్ ప్యానళ్ల కేటాయింపు



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** జిల్లాలో 'పీఎం సూర్యఘర్-ఎస్సీ, ఎస్టీ సోలరైజేషన్ పథకం' లబ్ధిదారులకు ప్యానళ్లు అందజేశారు. చినవాల్తేరు రెల్లివీధిలోని హెలెన్ కెల్లర్ సంస్థలో సోలార్ ప్లాంట్లను ఎంపీ ఎం.శ్రీభరత్, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిశోర్, ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్, తదితరులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, ఈ పథకం కింద కేంద్రం రూ.60 వేలు సబ్సిడీ ఇస్తుందని, మిగిలిన మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వం నాబార్డ్ ద్వారా రుణం అందించి భరిస్తుందని, దాంతో లబ్ధిదారులకు పూర్తి ఉచితంగా అందుతుందన్నారు. రెండు కిలోవాట్ల ప్లాంటు ద్వారా నెలకు 240 యూనిట్ల వరకు విద్యుత్ లభిస్తుందన్నారు. సీఎండీ పృథ్వీతేజ్ మాట్లాడుతూ, ఇప్పటివరకు 3,595 మంది లబ్ధిదారులను గుర్తించి 7.19 మెగావాట్ల ప్లాంట్లను కేటాయించామని, వాటికి రూ.41.35 కోట్లు వెచ్చిస్తున్నామన్నారు. ప్రస్తుతం ప్రపంచమంతటా యుద్ధ వాతావరణం ఉన్న నేపథ్యంలో ఇంధన వనరులకు ఇతరులపై ఆధారపడకుండా సొంతంగా సమకూర్చుకోవడంపై దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈపీడీసీఎల్ సర్కిల్ ఎస్ఈ శ్యాంబాబు, జోన్ ఈఈ పోలాకి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## పీపీపీ పేరుతో ప్రజల ఆస్తుల్ని లూటీ చేస్తున్న ప్రభుత్వం : గంగారావు




**విశాఖపట్నం, పతాకం న్యూస్:** గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న ప్రభుత్వ ఆస్తులను ప్రైవేట్ సంస్థలకు అప్పగించే టెండర్ల ప్రక్రియపై సిపిఎం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ చర్యలు ప్రజా వ్యతిరేకమని, వెంటనే టెండర్లను రద్దు చేయాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు విశాఖపట్నం జిల్లా సీపిఎం కార్యాలయం(ఏచూరి భవన్‌లో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో జివిఎంసి సిపిఎం ఫ్లోర్ లీడర్ డాక్టర్ బి.గంగారావు మాట్లాడుతూ .... ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని ప్రభుత్వం, జివిఎంసీ ఆధీనంలో ఉన్న వందల ఎకరాల భూములు, పార్కులు, మార్కెట్లు, స్టేడియంలను ప్రైవేట్ సంస్థలకు అప్పగించేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. నగరంలో సుమారు 600 ఎకరాలకు పైగా ఖాళీ భూములను టెండర్ల ద్వారా ప్రైవేట్ సంస్థలకు ఇవ్వాలని ప్రణాళిక ఉందని తెలిపారు. ముడసరలోవ పార్క్, శివాజీ పార్క్ సహా 350కు పైగా కాలనీ పార్కులను 99 ఏళ్లపాటు లీజుకు ఇవ్వాలని యోచిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందిరా ప్రియదర్శిని ఇండోర్ స్టేడియం, గాజువాక రాజీవ్ ఇండోర్ స్టేడియం, క్రీడా మైదానాలు, కమ్యూనిటీ హాల్స్, కళ్యాణ మండపాలు, అలాగే పూర్ణా మార్కెట్, కురపం మార్కెట్, జ్ఞానాపురం మార్కెట్ వంటి ప్రజా వనరులను కూడా పబ్లిక్ ప్రైవేట్ పార్టిసిపేషన్ పద్ధతిలో ప్రైవేట్ సంస్థలకు అప్పగించేందుకు టెండర్లు పిలిచినట్లు ఆరోపించారు. 1955 ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ కార్పొరేషన్ చట్టం ప్రకారం మున్సిపల్ ఆస్తులు ప్రజా ప్రయోజనాలకే వినియోగించాల్సి ఉంటుందని, వాటిని ప్రైవేట్ సంస్థలకు ఇవ్వడం చట్ట విరుద్ధమని సీపీఎం పేర్కొంది. ఇక సంపత్ వినాయకుడి వద్ద ఉన్న మున్సిపల్ క్వార్టర్స్, జివిఎంసీ ప్రధాన కార్యాలయం, స్మశానాలు వంటి ఆస్తులను కూడా ప్రైవేటీకరణలో భాగం చేస్తున్నారని ఆరోపించారు. ఈ నేపథ్యంలో స్థానిక ఎంపీలు, ఎమ్మెల్యేలు తమ వైఖరిని బహిరంగంగా వెల్లడించాలని సీపీఎం డిమాండ్ చేసింది. టెండర్లను వెంటనే ఉపసంహరించుకోకపోతే ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున పోరాటం చేపడతామని హెచ్చరించారు. అనంతరం సీపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు పి.మణి మాట్లాడుతూ విశాఖపట్నంలోని ప్రజల ఆస్తులను మానిటైజేషన్ పేరుతో ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించే ప్రక్రియను తీవ్రంగా వ్యతిరేకిస్తూ, ఈ టెండర్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని కోరారు. జీవీఎంసీ ప్రతి సంవత్సరం ఇంటి పన్నును 15 శాతం చొప్పున పెంచుతూ ప్రజలపై భారం మోపుతోందని ఆయన విమర్శించారు. గతంలో పన్నులు పెంచబోమని హామీ ఇచ్చి, ఇప్పుడు ఆ మాట తప్పి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్లు, పార్కులు, ఆటస్థలాలు వంటి ప్రాథమిక సదుపాయాలన్నీ ప్రైవేటీకరిస్తే, సాధారణ ప్రజలు చిన్న అవసరాలకైనా ప్రైవేట్ వ్యక్తుల అనుమతిపై ఆధారపడాల్సిన పరిస్థితి వస్తుందని మని పేర్కొన్నారు. "ప్రతిదీ ప్రైవేట్ వ్యక్తులే నిర్వహిస్తే ప్రభుత్వం అవసరం ఏమిటి?" అని ప్రశ్నిస్తూ, ప్రజా ప్రతినిధుల బాధ్యతలను కూడా ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించాలా అని ఎద్దేవా చేశారు. పీపీపీ విధానం ప్రజల ప్రయోజనాల కోసం కాకుండా పెట్టుబడిదారులు, కాంట్రాక్టర్లకు లాభం చేకూర్చడానికే ఉపయోగపడుతోందని ఆయన ఆరోపించారు.

## బంగారం తనఖా పెట్టుకొని ఇచ్చే రుణాలపై పరిమితి విధించిన వాణిజ్య బ్యాంకులు

### రైతులు, చిరు వ్యాపారులు, ఇతర వర్గాల వారికి ఇబ్బందే



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** బంగారం తనఖా పెట్టుకొని ఇచ్చే రుణాలపై వాణిజ్య బ్యాంకులు పరిమితి విధించాయి. గత నెల వరకు ఎంత బంగారం కుదువ పెట్టినప్పటికీ రుణాలు ఇచ్చేవారు. అయితే ఈ నెల ఒకటో తేదీ నుంచి ఆర్‌బీఐ నిబంధనలను మార్చిందని, బంగారంపై ఇచ్చే రుణం రూ.2.2 లక్షలకు మించితే ఆదాయ వివరాలు, తీసుకున్న అప్పును ఏ విధంగా తీరుస్తామన్న వివరాలతో వ్యక్తిగత ధ్రువపత్రాన్ని సమర్పించాల్సి వుంటుందని బ్యాంకర్లు చెబుతున్నారు. దీంతో వివిధ అవసరాల నిమిత్తం బంగారాన్ని బ్యాంకులో తాకట్టుపెట్టి రుణాలు తీసుకునే రైతులు, చిరువ్యాపారులు, దిగువ మధ్యతరగతి ప్రజలకు ఇబ్బందికరంగా వుంటుంది. వ్యవసాయ పెట్టుబడులు, కొత్త ఇళ్ల నిర్మాణం, వ్యాపారాల ప్రారంభం, పిల్లల ఉన్నత విద్య, వివాహాల ఖర్చులు, తదితర అవసరాల కోసం చాలా మంది తమ వద్ద వున్న బంగారు ఆభరణాలను బ్యాంకుల్లో తాకట్టుపెట్టి అప్పు తీసుకుంటుంటారు. మార్కెట్‌లో బంగారం ధర, ఆర్‌బీఐ నిబంధనలకు మేరకు బ్యాంకర్లు నిర్ణీత మొత్తంలో రుణాలు మంజూరు చేస్తుంటారు. అదే విధంగా తనఖా పెట్టే బంగారంపై పరిమితి అంటూ వుండేది కాదు. అయితే కొంతకాలం నుంచి బంగారం ధరల్లో అనూహ్యమైన హెచ్చుతగ్గులు కనిపిస్తుండడంతో పసిడి ఆభరణాలను తాకట్టుపెట్టుకొని బ్యాంకులు ఇచ్చే రుణాలపై ఆర్‌బీఐ కొత్తగా కొన్ని నిబంధనలను అమల్లోకి తెచ్చినట్టు సమాచారం. ఈ ఏడాది ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి ఇవి అమల్లోకి వచ్చాయి. బంగారం తాకట్టుపై రూ.2.2 లక్షల వరకు ఎలాంటి షరతులు లేకుండా రుణం ఇచ్చే అవకాశం ఉంది. అంతకు మించి రుణం కావాలంటే రైతులు తమ ఆదాయ ధ్రువపత్రం, అప్పు ఎలా తీరుస్తారు అనే వివరాలను బ్యాంకు అధికారులకు సమర్పించాల్సి ఉంటుందని సమాచారం. చిరువ్యాపారులైతే ఆదాయ పన్ను రిటర్న్, జీఎస్టీ సర్టిఫికెట్ సమర్పించాలి. ఉద్యోగులైతే శాలరీ సర్టిఫికెట్ ఇవ్వాలి. బంగారం తాకట్టుపై ఇచ్చే రుణాల విషయంలో ఆర్‌బీఐ విధించిన షరతులు రైతులు, చిరువ్యాపారులు, ఇతర వర్గాల వారికి ఇబ్బందికరమేనని అంటున్నారు. బంగారం తాకట్టు పెట్టి, అప్పు తీసుకోవడానికి ఆదాయ ధ్రువపత్రం సమర్పిస్తే, తెల్లరేషన్ కార్డు, ఇతర రాయితీలు పోయే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు. బంగారాన్ని తాకట్టుపెట్టి రుణం తీసుకోవడానికి ఇన్ని షరతులు విధించడం సరికాదని రైతులు, చిరువ్యాపారులు అభిప్రాయపడుతున్నారు. దీనివల్ల బంగారంపై రుణాల కోసం ప్రైవేటు ఆర్థిక సంస్థలను ఆశ్రయించాల్సి వస్తుందని, ఒకవేళ ఆ సంస్థలు దుకాణం మూసేస్తే తమ పరిస్థితి ఏమిటని ప్రశిస్తున్నారు.

## క్రెబ్స్ కంపెనీ లే ఆఫ్ ఎత్తివేయాలని కార్మికుల ధర్నా



**కశింకోట, పతాకం న్యూస్:** క్రెబ్స్ కంపెనీ లే ఆఫ్ ఎత్తివేయాలని, (సిఐటియు) కార్మికులకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేస్తూ .... బుధవారం చిత్తూరు జిల్లా కసింకోటలో క్రెబ్స్ వర్కర్స్ అండ్ స్టాఫ్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కశింకోట తేగాడ (కొత్తపల్లి) లో గల క్రెబ్స్ ఫార్మా కంపెనీ గత సంవత్సర కాలంగా మూతవేయడంతో కార్మికులు ఉపాధి కోల్పోయారని, 320 కార్మికులు ఉద్యోగుల కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాయని, ఇప్పటికే స్థానిక ఎమ్మెల్యే, ముఖ్యమంత్రి కి పదేపదే లే ఆఫ్ ఎత్తివేయాలని కోరినా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉందని. సమస్య పరిష్కరించడం లేదని. కంపెనీ తెరిపిస్తానన్న యాజమాన్యం, ఇప్పుడు కంపెనీలో ఉన్న యంత్రాలు ముడిసరుకు తరలించకపోవడానికి చర్యలు చేపడుతుందని, కంపెనీ తక్షణమే తెరిపించాలని కార్మికులు డిమాండ్ చేశారు. తక్షణమే కంపెనీ తేరిపించాలని, సంవత్సర కాలంగా సగం జీతాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బాబురావు, ఏ.అప్పారావు కన్నబాబు, శ్రీను, ఓ.అప్పారావు ఆధ్వర్యంలో జరిగింది.

## ఇంటర్ ఫలితాల్లో నాగయ్యపేట గ్రామ పల్లెటూరు అమ్మాయిలు టాప్



గొర్లి శ్రావ్య - 974 మార్కులు



రొంగళి గీతిక - 969 మార్కులు



రొంగళి జోష్నా - 964 మార్కులు

**దేవరాపల్లి, పతాకం న్యూస్:** వ్యవసాయం,కూలి పనులు చేసుకుంటూ ఆడపిల్లలు కదా అని వదిలియకుండా చదివించిన రైతుకూలీలు ఈరోజు ఇంటర్ ఫలితాల్లో నాగయ్యపేట గ్రామానికి చెందిన అమ్మాయిలు హోరా అనిపించారు. గొర్లి శ్రావ్య 974 మార్కులు, రొంగళి గీతిక 969 మార్కులు, రొంగళి జోష్నా 964 మార్కులు సాధించడంతో గ్రామంలో తల్లి తండ్రులు ఆనందంలో మునిగారు. రైతు కూలీలగా ఉన్న మేము మా ఆలోచనలను, కష్టాలును దృష్టిలో పెట్టుకొని మా పిల్లలు చదివి మంచి మార్కులు తెచ్చుకున్నారు అని అన్నారు.

## విశాఖ నుంచి భోగాపురానికి ఎలక్ట్రిక్ బస్సులు




**విశాఖపట్నం, పతాకం న్యూస్:** విశాఖపట్నం నుంచి భోగాపురం విమానాశ్రయానికి ప్రయాణం సౌకర్యవంతంగా ఉండేలా ప్రభుత్వం ప్రత్యేకకృషి చేస్తోంది. మాస్టర్ ప్లాన్ రహదారులు నిర్మించడంతో పాటు ఎలక్ట్రిక్ ఏసీ బస్సులను కూడా నడపాలని నిర్ణయించింది. దీనివల్ల ప్రయాణ సమయం బాగా కలిసి వచ్చే అవకాశం ఉంది. టాక్సీలకు వేల రూపాయలు చెల్లించే భారం తప్పుతుంది. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం జూన్ లేదా జూలై నెలలో ప్రారంభం కానున్నదని కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు ప్రకటించిన నేపథ్యంలో అక్కడకు ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి ప్రయాణికులను చేరవేసే మార్గాలపై అధికార వర్గాలు దృష్టి సారించాయి. విశాఖపట్నంలోని వివిధ ప్రాంతాల నుంచి భోగాపురం విమానాశ్రయం చేరుకోవడానికి వీఎంఆర్‌డీఏ ఏడు మాస్టర్ ప్లాన్ రహదారులను విస్తరిస్తున్న సంగతి తెలిసిందే. ఇవి జూన్ నెలాఖరుకు పూర్తిచేయడానికి ప్రయత్నిస్తున్నారు. అయితే విమాన ప్రయాణికులకు ప్రత్యేకంగా ఫెసిలిటీ సెంటర్లు ఏర్పాటు చేసి, అక్కడి నుంచి విమానాశ్రయానికి ఏసీ బస్సులు నడపాలని ఏపీ విమాన ప్రయాణికుల సంఘం రెండు నెలల క్రితం విజ్ఞప్తి చేసింది. విశాఖ నుంచి టాక్సీల్లో వెళితే ప్రయాణ వ్యయం విమాన టిక్కెట్ల ధరతో సమానంగా ఉంటుందని విశాఖ ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజుతో పాటు, రుషికొండ ఐటీ పార్క్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఓ.నరేశ్‌కుమార్‌లు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు. భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుతో మాట్లాడి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయించాలని కోరారు. ఇలా అనేక విజ్ఞప్తులు, సూచనలు రావడంతో దీనిపై ఆర్‌టీసీ అధికారులు దృష్టి సారించారు. కేంద్ర ప్రభుత్వం ప్రజా రవాణా వ్యవస్థలో వాహన కాలుష్యం తగ్గించడానికి ఎలక్ట్రిక్ బస్సులు (ఈ-బస్సులు) తీసుకువస్తోంది. వాటిని అన్ని రాష్ట్రాలకు ఇస్తామని ప్రకటించింది. ఆంధ్రప్రదేశ్‌కు సుమారు 500 వరకు వచ్చే అవకాశం ఉంది. అందులో వంద బస్సులు విశాఖపట్నానికి కేటాయిస్తామని ఐటీ మంత్రి నారా లోకేశ్ ప్రకటించారు. ఇవి జూన్ నెలాఖరుకు వచ్చే అవకాశం ఉంది. వాటి నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వం ఇప్పటికే ఆర్‌టీసీ అధికారులకు ఆదేశించింది. దాంతో సింహాచలం సమీపాన సింహపురి కాలనీలో ఆర్టీసీ అధికారులు సంస్థకున్న నాలుగు ఎకరాల స్థలంలో ఈ-బస్ స్టేషన్ నిర్మాణానికి చర్యలు చేపట్టారు. వచ్చే బస్సుల్లో సగం అక్కడి నుంచే ఆపరేట్ చేయాలని నిర్ణయించారు. మరికొన్ని బస్సులకు గాజువాక డిపోలో చార్జింగ్ స్టేషన్ ఏర్పాటుచేసి అక్కడి నుంచి నడపాలని ఏర్పాట్లు చేస్తున్నారు.

## ప్రజా భాగస్వామ్యంతో గంజాయికి అడ్డుకట్ట: అయ్యన్న



**గొలుగొండ, పతాకం న్యూస్:** ప్రజా భాగస్వామ్యంతో గంజాయి, మాదక ద్రవ్యాలకు అడ్డుకట్ట వేయవచ్చని స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. మండలంలోని గొలుగొండలో పోలీస్ స్టేషన్ నూతన భవనాన్ని హోం మంత్రి వంగలపూడి అనిత, విశాఖ రేంజ్ ఐజీ గోపీనాథ్ జట్టితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ నర్సీపట్నం ప్రాంతంలో గొలుగొండ, నాతవరం, రోలుగుంట మండలాల్లో గంజాయి రవాణా యథేచ్ఛగా సాగుతోందన్నారు. ఈ రవాణాను పూర్తిస్థాయిలో అరికట్టాలంటే ప్రజల సహకారం అవసరమన్నారు. పాకలపాడు గ్రామంతో పాటు గంజాయి రవాణా సాగుతున్న గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి పోలీసులు తనిఖీ చేయాలన్నారు. పార్టీలకు అతీతంగా గంజాయి అక్రమార్కులపై పోలీసులు తగిన చర్యలు చేపట్టాలన్నారు. కాగా నాతవరం మండలం నుంచి గొలుగొండ మండలంలో సాలికమల్లవరం వరకు తాండవ రిజర్వాయర్ అంచునున్న రోడ్డులో ప్రమాదాలు జరగకుండా సైడ్‌వాల్ నిర్మిస్తున్నట్టు ఆయన తెలిపారు. తాండవ రిజర్వాయర్‌లో గల మెట్టను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామన్నారు.

## వీఓఏలకు స్మార్ట్ ఫోన్లు పంపిణీ



**మెంటాడ, పతాకం న్యూస్:** మండలంలోని స్వయం సహాయక సంఘాల వీఓఏలకు ప్రభుత్వం మంజూరు చేసిన స్మార్ట్ ఫోన్లను మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గన్నులు, గొడ్డళ్లలంటూ జగన్ రక్తపాతాన్ని ఎంపిక చేసుకున్నారని మండిపడ్డారు. ముఖ్యమంత్రి చంద్రబాబు దార్శనికత, మంత్రి లోకేష్ పట్టుదలతో రాష్ట్రానికి ప్రపంచ దిగ్గజ ఐటీ సంస్థలు పోటెత్తుతున్నాయని అన్నారు. భవిష్యత్తులో ప్రపంచం చూపు ఆంధ్రప్రదేశ్ వైపు ఉంటుందని అన్నారు. రాష్ట్రాన్ని సమ్మిళిత ప్రగతి దిశగా కూటమి ప్రభుత్వం ముందుకు తీసుకువెళుతోందన్నారు. మండలంలో 30 మంది వీఓఏలు పని చేస్తున్నారని... స్మార్ట్‌ఫోన్ల ద్వారా సభ్యులకు వేగంగా, పారదర్శకంగా సేవలు అందించవచ్చునని చెప్పారు. అంతకుముందు మంత్రి సంధ్యారాణి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అభివృద్ధి పనులపై ఆరా తీశారు. ఉద్యోగులు బాధ్యతయుతంగా పనిచేస్తూ ప్రభుత్వానికి ప్రోత్సాహాన్ని అందించాలని సూచించారు. ముందుగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ విజయభాస్కర్, ఎంపీడీఓ సుదర్శన్, ఏపీఎం అన్నపూర్ణ, ఏవో గోకులకృష్ణ, మండల టీడీపీ అధ్యక్షుడు చలమూరి వెంకటరావు, గెద్ద అన్నవరం తదితరులు పాల్గొన్నారు.

## తోటపల్లిలో నీటి నిల్వలు తగ్గుముఖం



**గరుగుబిల్లి, పతాకం న్యూస్:** తోటపల్లి భారీ సాగునీటి ప్రాజెక్టులో రోజురోజుకీ నీటి నిల్వలు తగ్గుతున్నాయి. ఒకవైపు ఎండలు, మరోవైపు ఎగువ ప్రాంత నుంచి పూర్తిస్థాయిలో నీరు సరఫరా కావడం లేదు. దీంతో నిత్యం జలకళతో ఉట్టిపడే తోటపల్లి అడుగంటుతుంది. నాగావళి నది మధ్య భాగంలో దిబ్బలు దర్శనమిస్తున్నాయి. ప్రాజెక్టులో 105 మీటర్లకు గాను ప్రస్తుతం 102.25 మీటర్ల మేర నీటి నిల్వలు ఉన్నాయి. ఎండలు ముదిరితే ఈ నిల్వలు మరింత తగ్గనున్నాయి. పైనుంచి ప్రాజెక్టులోకి 35 క్యూసెక్కులు చేరగా, నదిలోకి 90 క్యూసెక్కులను విడుదల చేశారు. పాత రెగ్యులేటర్ పరిధిలోని ఎడమ ప్రధాన కాలువ నుంచి 200 క్యూసెక్కులు, కుడి కాలువ నుంచి 60 క్యూసెక్కులను దిగువ ప్రాంతాలకు సరఫరా చేస్తున్నారు. ప్రస్తుతం కొత్త రెగ్యులేటర్ పరిధిలో కుడి ప్రధాన కాలువ నుంచి సాగునీరు సరఫరా నిలుపుదల చేశారు. కాగా ఇదే పరిస్థితి కొనసాగితే ఖరీఫ్‌కు సాగునీటి కష్టాలు తప్పవని రైతులు ఆందోళన చెందుతున్నారు. దీనిపై ప్రాజెక్టు జేఈ శ్రీనివాసరావును వివరణ కోరగా.. వర్షాలతో పాటు పై ప్రాంతం నుంచి నీటి ప్రవాహం వస్తే ఖరీఫ్ సాగుకు ఇబ్బంది ఉండదని తెలిపారు.

## అప్రమత్తతతోనే అగ్ని ప్రమాదాల నివారణ



**శ్రీకాకుళం, పతాకం న్యూస్:** అగ్ని ప్రమాదాల నివారణ అప్రమత్తతతోనే సాధ్యమని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. స్థానిక అగ్నిమాపక వారోత్సవాలను ప్రారంభించారు. వారోత్సవాలకు సం బంధించిన పోస్టర్లను ఆవిష్కరిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రమా దాలు సంభవించినప్పుడు ప్రాణ, ఆస్తి నష్టాలను నివారించేందుకు సిబ్బంది చేసే సాహసాలు అభినంద నీయమన్నారు. చిన్నపాటి నిర్లక్ష్యం ఒక్కోసారి పెను ప్రమాదాలకు దారితీస్తుందన్నారు. ఇళ్లలో గ్యాస్ వినియోగించినప్పుడు మరింత అప్రమత్తంగా ఉండా లన్నారు. విపత్తుల కాలంలో అగ్నిమాపక సిబ్బంది ప్రాణాలను పణంగా పెట్టి చేసే సేవలు వెల కట్టలేనివ న్నారు. అగ్ని ప్రమాదా లపై ప్రతి ఒక్క రిలో అవ గాహన పెంపొందిం చడమే లక్ష్యంగా ఈ వారోత్స వాలను నిర్వహి స్తున్నట్టు వివరించారు. అనంతరం సిబ్బంది మాక్ డ్రిల్ నిర్వహిం చారు. కార్యక్రమంలో డీఎఫ్‌వో జడ్డు మోహన రావు, ఏడీఎఫ్‌వో శ్రీనుబాబు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



**నందిగామ, పతాకం న్యూస్:** రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన బుధవారం ఎన్టిఆర్ జిల్లా నందిగామలో జరిగింది. నందిగామ సమీపంలోని ఐతవరం వద్ద రోడ్డు ప్రమాదం జరిగింది. మద్రాస్ ఫిల్టర్ కాఫీ హోటల్ సమీపంలో కారు, బైకు ఢీకొన్న ఘటనలో కంచికచర్లకు చెందిన లక్ష్మీనారాయణ (50) తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వెంటనే ఆయనను నందిగామ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మరణించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

# రిజిస్ట్రేషన్స్ ఆదాయం రూ.1,174 కోట్లు




**విశాఖపట్నం, పతాకం న్యూస్:** విశాఖపట్నంలో స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ద్వారా గత మూడేళ్లుగా ప్రభుత్వానికి వేయి కోట్ల రూపాయలు చొప్పున ఆదాయం వస్తోంది. జిల్లాలో తొమ్మిది సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉండగా, గడచిన (2025-26) ఆర్థిక సంవత్సరం రూ.1,174.37 కోట్ల ఆదాయం సాధించాయి. ప్రభుత్వం రూ.1,500 కోట్ల లక్ష్యాన్ని ఇవ్వగా అందులో 78 శాతం సాధించాయి. తొమ్మిదింటిలో మధురవాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం సింహభాగం సాధించి రూ.320.62 కోట్లతో మొదటి స్థానంలో నిలిచింది. సూపర్ బజారు కార్యాలయం రూ.225.8 కోట్లతో ద్వితీయ స్థానంలోను, ద్వారకానగర్ కార్యాలయం రూ.117.78 కోట్లతో మూడో స్థానంలో నిలిచాయి. అంతకుముందు ఏడాది అంటే 2024-25 ఆర్థిక సంవత్సరంలో మొత్తం ఆదాయం రూ.1,050.58 కోట్లు రాగా, మధురవాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం రూ.263.9 కోట్లతో అగ్రస్థానంలో నిలిచింది. సూపర్‌బజార్ కార్యాలయం రూ.247.51 కోట్లతో ద్వితీయ స్థానంలో, ద్వారకానగర్ కార్యాలయం రూ.110.55 కోట్లతో తృతీయ స్థానంలో నిలిచాయి. 2023-24 ఆర్థిక సంవత్సరంలో మొత్తం ఆదాయం రూ.1,032.42 కోట్ల ఆదాయం రాగా అందులో మధురవాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం రూ.235.38 కోట్లు సాధించి ప్రథమ స్థానంలో నిలిచింది. సూపర్‌బజార్ కార్యాలయం రూ.219.36 కోట్లతో రెండో స్థానంలో, ద్వారకా నగర్ కార్యాలయం రూ.116.92 కోట్లతో మూడో స్థానంలో నిలిచాయి

## సూర్యఘర్ యోజన ఉత్సవ్



**గుమ్మలక్ష్మీపురం, పతాకం న్యూస్:** పి.ఆమిటి గ్రామంలో పీఎం సూర్యఘర్ యోజన ఉత్సవ్‌ను నిర్వహించారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి పాల్గొని మాట్లాడు తూ సూర్యఘర్ యోజన ద్వారా ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు ఉచితంగా సూర్యఘర్ యో జన అమలు చేస్తున్నామన్నారు. కార్య క్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు అడ్డాకుల నరేష్, ఎస్టీ కమిషన్ సభ్యుడు కద్రక మల్లేశ్వరరావు, ట్రైకార్ బోర్డు డైరెక్టర్ పువ్వుల లావణ్య, అరకు పార్లమెంట్ సహాయ కార్యదర్శి తాడంగి రామారావు, కురపాం ఏఎంసీ వైస్ చైర్మన్ గార గౌరీశంకర్, విద్యుత్ శాఖ ఏడీఈ రాజేంద్రప్రసాద్, జీఎల్‌పురం ఏఈ రవికుమార్, కురపాం ఏఈ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

## రెండు హత్యకేసుల నిందితుడు ఆత్మహత్య



**పలాస, పతాకం న్యూస్:** రెండు హత్యకేసుల్లో ప్రధాన నిందితుడు.. పలాస మండలం మహదేవపురం గ్రామానికి చెందిన మడియా రామారావు(45) ఆత్మహత్య చేసుకున్నాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో మెడకు ఉరేసుకున్నాడు. దీనికి సంబంధించి కాశీబుగ్గ ఎస్ఐ ఆర్‌వీఆర్.నాయుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మందస, బారువ పోలీస్టేషన్ పరిధిలో 15 రోజుల వ్యవధిలో ఇద్దర్ని దారుణంగా హతమార్చి మడియా రామారావు పోలీసులకు చిక్కాడు. గతేడాది పాలవలస వద్ద ఆర్మీ జవానును తన వివాహేతర సంబంధానికి అడ్డు వస్తున్నాడని హతమార్చాడు. దీన్ని ప్రత్యక్షంగా చూసిన మహిళతో కూడా వివాహేతర సంబంధం పెట్టుకోవడంతోపాటు డబ్బులు డిమాండ్ చేస్తుందని భావించి చంపేశాడు. వివాహేతర సంబంధాల నేపథ్యంలో ఈ హత్యలు జరిగినట్లు పోలీసులు గుర్తించి రామారావును అరెస్టు చేసి జైలుకు పంపించారు. ఈ క్రమంలో నెల రోజుల కిందట ఆయన కండీషన్ బెయిల్‌పై స్వగ్రామం మహదేవపురం వచ్చాడు. బుధవారం దీనికి సంబంధించి బెయిల్ వ్యవధి పూర్తవుతుంది. పూచీకత్తులు సమర్పించి మరోసారి బెయిల్ కోసం ప్రయత్నం చేయాల్సి ఉంది. అయితే పూచీకత్తులు ఇచ్చేందుకు ఎవరూ అంగీకారం తెలియజేయపోవడంతో తనకు మళ్లీ జైలు, చేసిన నేరానికి జీవితఖైదు తప్పదని భావించాడు. వారం రోజుల నుంచి భార్య ప్రమీలతో కూడా తగాదా పడుతున్నాడు. ఈ క్రమంలో ప్రమీల జీడి పరిశ్రమలో పనిచేయడానికి వెళ్లగా.. ఇంటిలో ఎవరూ లేని సమయం చూసుకొని రామారావు ఉరేసుకున్నాడు. దీంతో భార్య, ఇద్దరు కుమారులు, కుటుంబ సభ్యులు విలపించారు. ప్రమీల ఫిర్యాదు మేరకు ఈ ఘటనపై కేసు నమోదు చేస్తున్నామని ఎస్ఐ ఆర్‌వీఆర్ నాయుడు తెలిపారు. మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం పలాస ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

## అండమాన్ సముద్రంలో పడవ బోల్తా 250 మంది గల్లంతు



**అండమాన్, పతాకం న్యూస్:** అండమాన్ సముద్రంలో ఘోర ప్రమాదం జరిగింది. దక్షిణ బంగ్లాదేశ్‌లోని టెక్నాఫ్ నుంచి బయలుదేరిన పడవ మలేషియాకు వెళుతుండగా, సముద్రంలో పడవ బోల్తా పడటంతో 250 మంది గల్లంతయ్యారు. రోహింగ్యా శరణార్థులు, బంగ్లాదేశ్ జాతీయులు ఈ పడవలో ఉన్నారు. బలమైన గాలులు, అల్లకల్లోలమైన సముద్రం, సామర్థ్యానికి మించి ప్రయాణించడమే ప్రమాదానికి కారణంగా తెలుస్తుంది. రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతోంది. గల్లంతైన వారిలో చిన్నారులు కూడా ఉన్నారు. ఈ ప్రమాదంపై ఐక్యరాజ్యసమితి శరణార్థుల హైకమిషనర్, ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఫర్ మైగ్రేషన్ సంయుక్త ప్రకటన విడుదల చేసింది. ఈ పడవ దక్షిణ బంగ్లాదేశ్ లో టేక్‌నాఫ్ ప్రాంతం నుంచి బయలుదేరినట్లు ఈ ప్రకటనలో ఐరాస అధికారులు పేర్కొన్నారు. ఈ పడవ ఏప్రిల్ 4 న బంగ్లాదేశ్ నుంచి బయలుదేరినట్లు తెలుస్తుంది. కాక్స్ బజార్‌లోని శరణార్థుల శిబిరాల్లో ఉన్న వీరు కనీస జీవన సదుపాయాల కోసం మలేషియాకు వలస వెళుతుండగా ఈ ఘోర ప్రమాదం చోటుచేసుకున్నట్లు ఐరాస అధికారులు వెల్లడించారు. వాస్తవానికి రోహింగ్యాలు.. మయన్మార్‌కు చెందినవారు. కానీ, 2017లో అక్కడి సైన్యం మారణహోమం నుంచి తప్పించుకునేందుకు లక్షలాది రోహింగ్యాలు బంగ్లాదేశ్‌కు తరలిపోయారు. దీంతో కాక్స్ బజార్‌లో శరణార్థి శిబిరాలు కిక్కిరిసిపోయాయి. అయితే, ఇటీవల ఇక్కడి పరిస్థితులూ క్షీణించడంతో వీరంతా ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయేందుకు వలసబాటపడుతున్నారు. ఈ క్రమంలోనే ప్రమాదకర సముద్ర ప్రయాణాలను ఎంచుకుంటున్నారు.

## తాగునీరు కావాలంటే రెండు కిలోమీటర్లు నడిచి.. కొండ దిగి ఎక్కాల్సిందే..



**గుమ్మలక్ష్మీపురం, పతాకం న్యూస్:** గిరిశిఖర గ్రామం శిఖరపాయికు చెందిన గిరిజనులు తాగునీటి కష్టాలు ఎదుర్కొంటున్నారు. బిందెడు ఊట నీటి కోసం ఆ గ్రామ గిరిజన మహిళలు రెండు కిలోమీటర్లు నడిచి.. కొండ దిగి ఎక్కాల్సి వస్తోంది. కొన్నాళ్లుగా ఆ ప్రాంతవాసులు ఈ సమస్యతో సతమతమవుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. మండల కేంద్రానికి సుమారు 22 కిలోమీటర్ల దూరంలో ఉన్న శిఖరపాయి గ్రామంలో సుమారు వంద మంది నివసిస్తున్నారు. వారి అవసరాల కోసం గతంలో ఐటీడీఏ అధికారులు శిఖరపాయిలో ఓ ట్యాంక్‌ను నిర్మించారు. గ్రావిటీ పైప్‌లైన్ ద్వారా కొండ ప్రాంతం నుంచి నీటిని అందించేవారు. అయితే గ్రావిటీ పైప్‌లైన్ దెబ్బతినడంతో నీరు రావడం లేదు. దీంతో ఆ గ్రామస్థులు ఊట నీటిపై ఆధారపడాల్సి వస్తోంది. దీని కోసం వారు నిత్యం కొండ దిగి ఎక్కాల్సి వస్తోంది. వాస్తవంగా శిఖరపాయికి సరైన రహదారి లేదు. ఈ కారణంగా రిగ్గు వాహనం గ్రామానికి చేరుకోలేకపోవడంతో అక్కడ బోర్ ఏర్పాటు చేయలేకపోయారు. గతంలో గ్రామస్థులు బావి తవ్వినా నీరు పడలేదు. ఈ కారణంగానే వారు కొండల నుంచి వచ్చే ఊట నీటిపైనే ఆధారపడుతున్నారు. ఈ నీరు కలుషితమైనా తప్పనిసరి పరిస్థితుల్లో దానినే వినియోగిస్తూ రోగాల పాలవుతున్నారు. ఐటీడీఏ అధికారులు తాగునీటి సమస్య పరిష్కరించాలని, తమ గ్రామానికి రహదారి సౌకర్యం కల్పించాలని ఆ ప్రాంత గిరిజనులు కోరుతున్నారు. 'మా పంచాయతీ పరిధిలోని మూడు గ్రామాలకు సరైన తాగునీటి సౌకర్యం లేదు. తక్షణమే ఈ సమస్య పరిష్కరించాలి.' అని తాడికొండ మాజీ సర్పంచ్ జగ్గారావు కోరారు. త్వరలో గ్రావిటీ పైప్‌లైన్ బాగు చేసి నీటి సరఫరా చేస్తామని ఎంపీడీవో శ్రీనివాసరావు తెలిపారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీర్ అధికారులను ఆ గ్రామానికి పంపిస్తాం. గ్రావిటీ పైప్‌లైన్ మరమ్మతులకు నిధులు మంజూరు చేస్తాం. ఆ గ్రామస్థులకు తాగునీటి సమస్య పరిష్కరిస్తాం. ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో యశ్వంత్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

## సృజనాత్మక ఆలోచనలతో ముందుకు సాగాలి



**శ్రీకాకుళం, పతాకం న్యూస్:** విద్యార్థులు సృజనాత్మక ఆలోచనలతో ముందుకు సాగాలని పీఎంశ్రీ కార్యక్రమం జాయింట్ సెక్రటరీ ఆశిష్ కుమార్ గుప్తా అన్నారు. ఎచ్చెర్ల డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బాలిక గురుకుల పాఠశాల/ కళాశాలను సందర్శించారు. పీఎంశ్రీ అమలును పరిశీలించారు. తరగతి గదుల్లో ఐఎఫ్‌బీ ప్యానల్స్, ముస్తాబు కార్యక్రమం, ల్యాబ్స్, లైబ్రరీ, కిచెన్ గార్డెన్, ర్యాంపులను చూశారు. విద్యార్థినులు రూపొందించిన నమూనాలను పరిశీలించారు. పీఎంశ్రీ అమలు, ఫొటో, పీపీటీ ప్రదర్శన ద్వారా పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.పద్మజ వివరించారు. స్కౌట్, గైడ్స్ ప్రదర్శనను తిలకించారు. కార్యక్రమంలో డీఈవో రవిబాబు, డీసీవో వై.యశోదలక్ష్మి, ఎంఈవోలు కె.పున్నయ్య, జి.రాజ్‌కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి నియోజకవర్గంలో అన్నా క్యాంటీన్: అచ్చెన్నాయుడు

**శ్రీకాకుళం, పతాకం న్యూస్:** పేదవాడికి కడుపు నిండా అన్నం పెట్టాలన్నదే అన్నా క్యాంటీన్ ఉద్దేశమని మంత్రి అచ్చెన్నాయుడు(వీఱఅఱర్వతీ చూ్ఎష్ట్రుఅఝఱఎబ) తెలిపారు. ఈరోజు(బుధవారం) టెక్కలిలో అన్నా క్యాంటీన్‌ను మంత్రి ప్రారంభించారు. అనంతరం అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబు అనేక కార్యక్రమాలు తీసుకొచ్చినా.. అన్నా క్యాంటీన్ ద్వారా భోజనం పెట్టినంత ఆనందం ఎప్పుడూ లేదన్నారు. తమిళనాడులో జయలలిత పెట్టిన క్యాంటీన్లను స్టాలిన్ కొనసాగించారని.. ఏపీలో గత వైసీపీ ప్రభుత్వం మాత్రం పేదల కడుపు కొట్టిందని విమర్శించారు. ఎన్టీఆర్ పేరు నచ్చకపోతే మరో పేరు పెట్టి కార్యక్రమం కొనసాగించాలని అడిగామని.. కానీ జగన్ మనసు కరగలేదని మంత్రి మండిపడ్డారు. జగన్ దుర్మార్గుడు అంటూ వ్యాఖ్యానించారు. జగన్ అన్నా క్యాంటీన్లు మూసివేస్తే.. టీడీపీ నేతలు స్వచ్ఛందంగా పేదలకు అన్నం పెట్టారని గుర్తుచేశారు. ఇప్పటి వరకూ 207 అన్నా క్యాంటీన్లు మున్సిపాలిటీల్లో నడుస్తున్నాయని తెలిపారు.

## శరవేగంగా తుంగభద్ర గేట్ల ఏర్పాటు



**కర్నూలు, పతాకం న్యూస్:** ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల ప్రాణాధారమైన తుంగభద్ర డ్యాం నూతన క్రస్ట్ గేట్ల ఏర్పాటు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఏపీ జలవనరుల శాఖ (మెకానికల్ విభాగం) సలహాదారుడు, గేట్ల నిపుణుడు ఎన్.కన్నయ్యనాయుడు గట్ల ఏర్పాటు పనులను పరిశీలించారు. టీబీపీ బోర్డు ఎస్ఈ నారాయణనాయక్, బోర్డు ఇంజనీర్ల పర్యవేక్షణలో గుజరాత్‌కు చెందిన హార్డ్‌వేర్ టూల్స్ సంస్థ క్రస్ట్‌గేట్లు తయారి(ఫ్యాబ్రికేషన్), అమర్చడం (ఎరక్షన్) పనులు చేపట్టింది. గత డిసెంబరు 6న గేట్ల ఏర్పాటు పనులకు శ్రీకారం చుట్టి కేవలం 129 రోజుల్లో 25 గేట్లు పూర్తిగా ఏర్పాటు చేయడమే కాకుండా 22 గేట్లు ట్రైల్‌రన్ కూడా పూర్తి చేశారు. మిగిలిన ఐదు గేట్ల పనులు వివిధ దశల్లో ఉన్నాయి. కన్నయ్య నాయుడు ప్రతిగేటును క్షుణంగా పరిశీలించి, టీబీపీ బోర్డు ఇంజనీర్లకు కీలక సూచనలు చేశారు. ఈయన వెంట ఏపీ వర్క్‌షాప్ సలహాదారు మెకానికల్ ఇంజనీరు కృష్ణారావు, టీబీపీ బోర్డు సెక్రెటరీ ఓఆర్కే రెడ్డి, కర్ణాటక రాష్ట్రం మునిరాబాద్ సీఈ మలిగవాడ, బోర్డు ఎస్ఈ నారాయణ నాయక్, డ్యాం ఈఈ చంద్రశేఖర్ ఉన్నారు. ఈ సందర్భంగా కన్నయ్యనాయుడు మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ప్రత్యేక కృషి, కర్ణాటక ప్రభుత్వ సహకారం, రైతుల త్యాగం వల్లే రికార్డు స్థాయిలో గేట్ల ఏర్పాటు సాధ్యమవుతోందని చెప్పారు. మే 15లోగా మొత్తం గేట్ల ఏర్పాటు పూర్తవుతుందని, ఏమైనా చిన్నచిన్న పనులు మిగిలితే ఆ నెలాఖరులోగా పూర్తి చేస్తామని చెప్పారు.

## సాంకేతిక లోపంతో ఉద్యోగం పోయి.. కూలిగా మారిన ప్రభుత్వ ఉద్యోగి..



**హైదరాబాద్, పతాకం న్యూస్:** ఓ వ్యక్తి ప్రభుత్వ ఉద్యోగం కోల్పోయి సెంట్రింగ్ కూలీగా మారిన ఘటన జగిత్యాల జిల్లాలో జరిగింది. జగిత్యాల జిల్లాకు చెందిన లక్ష్మీరాజం 2012 లో వీఆర్‌ఏగా ప్రభుత్వ సర్వీసులో చేరి 11 ఏళ్లపాటు పనిచేశారు. ఆ తర్వాత వార్డ్ ఆఫీసర్‌గా పదోన్నతి పొందారు. ఉద్యోగం చేస్తూనే డీఎస్సీ రాసిన రాజంకు మంచి ర్యాంకు వచ్చింది. దాంతో మున్సిపల్ ఉద్యోగానికి రాజీనామా చేసి.. ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా ఉద్యోగంలో చేరారు. 2024 అక్టోబర్ 5న డీఎస్సీ ఉద్యోగం కోసం సర్టిఫికెట్ల వెరిఫికేషన్ జరిగింది. అయితే అప్పటికి లక్ష్మీరాజం 'రిహాబిలిటేషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (=జ×)' సర్టిఫికెట్ గడువు ముగిసింది. దాంతో ఆయన సర్టిఫికెట్ వెరిఫికేషన్‌లో అప్పటికే రెన్యువల్ కోసం దరఖాస్తు చేసిన పత్రాలను చూపించారు. అక్టోబర్ 7న ఢిల్లీలో సర్టిఫికెట్‌ను రెన్యువల్ చేయించుకుని మర్పించారు. ఆ తర్వాత ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా నియామక పత్రం అందుకుని అక్టోబర్ 16న విధుల్లో చేరారు. దాదాపుగా 8 నెలలపాటు ఉపాధ్యాయుడిగా పనిచేశారు. ఆ తర్వాత అధికారులు సర్టిఫికెట్ వెరిఫికేషన్ తేదీ నాటికి లక్ష్మీరాజం ఆర్‌సీఐ సర్టిఫికెట్ రెన్యువల్ కాలేదన్న సాంకేతిక కారణాన్ని చూపి ఆయనను ఉద్యోగం నుంచి తొలగించారు. దాంతో తీవ్ర ఆవేదనకు గురైన లక్ష్మీరాజం హైకోర్టును ఆశ్రయించారు. కోర్టు 'స్టేటస్ కో' ఉత్తర్వులు జారీచేసింది. కానీ ప్రస్తుతం ఏ ఉపాధీ లేకపోవడంతో.. లక్ష్మీరాజం సెంట్రింగ్ కూలీగా జీవనం గడుపుతున్నారు. ఈ క్రమంలో సోమవారం ఆయన జగిత్యాల ప్రజావాణిలో కలెక్టర్‌ను కలిసి, తనకు న్యాయం చేయాలని వినతిపత్రం అందించారు. దీనిపై జిల్లా విద్యాధికారి (డీఈఓ) రాము స్పందిస్తూ.. సర్టిఫికెట్ వెరిఫికేషన్ రోజు నాటికి ఆర్సీఐ సర్టిఫికెట్ రెన్యువల్ కాలేదని ఒక వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ జరిపి ఉన్నతాధికారుల ఆదేశాలతోనే చర్యలు తీసుకున్నామని చెప్పారు. కాగా కలెక్టర్ జోక్యంతోనైనా తన సమస్య పరిష్కారమవుతుందని లక్ష్మీరాజం ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## శ్రీశైలంలో భారీగా మద్యం పట్టివేత.. ఐదుగురు అరెస్ట్



**శ్రీశైలం, పతాకం న్యూస్:** శ్రీశైలంలో ఐదుగురు మహిళల వద్ద భారీగా మద్యం పట్టుబడింది. మద్య సీసాలను పోలీసులు సీజ్ చేసి ముద్దాయిలను అరెస్టు చేశారు. శ్రీశైల పుణ్యక్షేత్రంలో ఉదయం తొమ్మిది గంటల సమయంలో ఆత్మకూరు డిఎస్పీ ఉత్తర్వుల మేరకు శ్రీశైలం సిఐ గంగనాథ్ బాబు ఆధ్వర్యంలో ఎస్సై సుబ్బారెడ్డి, సిబ్బంది కలిసి శ్రీశైలం పరిసర ప్రాంతాలైన రామయ్య టర్నింగ్, టోల్గేట్, టూరిస్ట్ బస్టాండ్లో ఐదుగురు మహిళల ముద్దాయిల వద్ద ఉన్న 24 లీటర్ల సారాయి, 314 డీపీఎల్ 180 ఎం.ఎల్ బాటిల్స్ ను సీజ్ చేసి ఐదుగురు ముద్దాయిలను అరెస్టు చేశారు. వారిని ఆత్మకూరు కోర్టుకు తరలించారు. ఈ సందర్భంగా శ్రీశైలం సీఐ గంగనాద బాబు మాట్లాడుతూ .... శ్రీశైలం పవిత్ర క్షేత్రంలో దేవాదాయ చట్టానికి విరుద్ధంగా అమ్మడం నిషేధం అన్నారు. శ్రీశైలంలో మాంసము, బీడీ, సిగరెట్లు అమ్మిన ఎంతటి వారిపైనా అయిన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పుణ్యక్షేత్రంలో ఇలాంటి నిషిద్ధ మైన వాటిపై చాలా కఠినంగా వ్యవహరిస్తామని, అవసరమైతే పీడి యాక్ట్ పెట్టి జైలుకు పంపిస్తామన్నారు. పట్టుబడినవారు ఆత్మకూరు నుండి మద్యం తెచ్చుకొని శ్రీశైలంలో అమ్ముతున్నట్టు తెలిపారు. ఆత్మకూరు నుండి (4) ఆదిలక్ష్మి, అశ్విని, హేమలత, మంగమ్మ, సుశీలమ్మ దోర్నాల నుండి ఒక మహిళ ఉన్నారని తెలిపారు.

# కొత్త పెన్షన్ కోసం ప్రజల ఎదురుచూపులు!

- గ్రామ, వార్డు సచివాలయాలు, యూసీడీ, డీఆర్డీఏ, కలెక్టరేట్లలో పెరుగుతున్న దరఖాస్తుల లిస్ట్
- మూడేళ్లలో భారీగా పెరిగిన దరఖాస్తులు..
- ఆందోళన కలిగిస్తున్న వితంతుల అర్జీలు



**విజయవాడ, పతాకం న్యూస్:** ఏపీ ప్రభుత్వ పెన్షన్ల కోసం ఉమ్మడి కృష్ణాజిల్లాలో ఏడాదికి అక్షరాల రూ.2400 కోట్లను ఖర్చు చేస్తోంది. ఎన్టీఆర్ జిల్లాలో 2,80,000 మందికి నెలకు రూ.18 కోట్ల చొప్పున పెన్షన్ చెల్లిస్తోంది. ఏడాదికి రూ.1,176 కోట్లను పేదలకు ఖర్చు చేస్తోంది. కృష్ణా జిల్లాలో 2,87,000 మందికి నెలకు రూ.102 కోట్లను ఖర్చు చేస్తోంది. ఏడాదికి రూ.1,224 కోట్లను పెన్షన్లకు ఖర్చు చేస్తోంది. పెన్షన్లకు సంబంధించి కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి రాగానే ఒక్కసారిగా రూ.3 వేల నుంచి రూ.4 వేలకు సాధారణ పెన్షన్లను పెంచింది. రూ.15 వేల వరకు వివిధ కేటగిరీల పెన్షన్లు ఇస్తుండటంతో ఎంతోమంది పెన్షన్ల కోసం దరఖాస్తులు చేసుకుంటున్నారు. పెన్షన్ల కోసం భారీ స్థాయిలో దరఖాస్తులు వస్తున్నాయి.. మూడేళ్లుగా నూతన పెన్షన్‌కు అవకాశం లేకపోవటంతో గ్రామ, వార్డు సచివాలయాలు, డీఆర్‌ఏ, యూసీడీ, కలెక్టరేట్లకు వచ్చి దరఖాస్తులను సమర్పిస్తున్నారు. పెన్షన్ల కోసం వస్తున్న దరఖాస్తులు ఆయా కార్యాలయాల్లో గుట్టలుగా పడి ఉంటున్నాయి. ఉమ్మడి జిల్లాలో 30 వేల పెన్షన్లకు దరఖాస్తులు చేసుకున్నట్లు డీఆర్‌డీఏ అధికారుల అంచనాగా ఉంది. ఎన్టీఆర్ జిల్లాలో 22వేలు, కృష్ణాజిల్లాలో ఎనిమిది వేలకు పైగా దరఖాస్తులు వచ్చాయి. ఎన్టీఆర్ జిల్లాలో వచ్చిన 22 వేల దరఖాస్తుల్లో విజయవాడ నగరంలో పట్టణ సామాజిక అభివృద్ధి (యూసీడీ) విభాగానికి 10 వేలకు పైగా అర్జీలు వచ్చాయి. ఉమ్మడి కృష్ణాజిల్లాలో గత మూడేళ్లుగా కొత్త పెన్షన్లు ఇవ్వకపోవడంతో వృద్ధాప్య పెన్షన్లు పెరిగాయి. అరవై సంవత్సరాలు వచ్చిన ప్రతి ఒక్కరూ పెన్షన్‌కు అర్హులు కావటంతో దరఖాస్తులు చేస్తున్నారు. కరోనా తర్వాత కారణాలు ఏవైనప్పటికీ మరణాల సంఖ్య పెరుగుతోంది. అకస్మాత్తుగా వచ్చే గుండెపోట్లు, అవయవాల వైఫల్యం ఇతర జబ్బులతో మరణిస్తున్న వారి సంఖ్య పెరిగింది. ప్రాణాంతక వ్యాధుల బారిన పడిన వారి సంఖ్య కూడా పెరుగుతోంది. ఈ కారణంగా వృద్ధాప్య వితంతు, ప్రమాదకర వ్యాధుల కేటగిరికి సంబంధించి పెన్షన్ల దరఖాస్తులు ఎక్కువగా వస్తున్నాయి. ఉమ్మడి కృష్ణా జిల్లాలో పెన్షన్లకు యువ వితంతువులు ఎక్కువ సంఖ్యలో దరఖాస్తులు చేసుకోవటం ఆందోళన కలిగిస్తోంది. యువ వితంతువులు పెరగటానికి పైన చెప్పుకున్న అనారోగ్య కారణాలే కాకుండా. ఇటీవల కాలంలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాలు, ఇతర మరణాలు కారణమని తెలుస్తోంది. చిన్న వయస్సులోనే భర్తలను కోల్పోవాల్సి రావటంతో యువ వితంతువుల సంఖ్య పెరిగిందని అధికారులు చెబుతున్నారు. ఉమ్మడి జిల్లా డీఆర్‌డీఏ అధికారుల అంచనాల ప్రకారం 30 వేల దరఖాస్తులు అని చెబుతున్నా.. వాస్తవంగా వచ్చిన దరఖాస్తులపై స్పష్టత లేదు. ఎందుకంటే ముందుగా ప్రజలు గ్రామ, వార్డు సచివాలయాల్లో పెన్షన్ల కోసం ఆర్జీలను సమర్పిస్తున్నారు. ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేయాల్సి ఉండటంతో... లాగిన్ ఇవ్వకపోవటంతో దరఖాస్తులను తమ దగ్గరే పెట్టుకుంటున్నారు. ఇక లాభం లేదని ఎంపీడీవో కార్యాలయాల్లో గ్రీవెన్స్‌కు వెళ్లి అక్కడ దరఖాస్తులు ఇస్తున్నారు. విజయవాడ నగరంలో వార్డు సచివాలయాల్లో పనికావటం లేదని, కార్పొరేషన్ యూసీడీ విభాగానికి వెళ్లి అక్కడ దరఖాస్తులు ఇస్తున్నారు. జిల్లా స్థాయిలో డీఆర్‌ఏ కార్యాలయానికి కూడా వెళ్లి దరఖాస్తులు అందజేస్తున్నారు. అంతిమంగా కలెక్టరేట్లలో నిర్వహించే పీజీఆర్‌ఎస్‌లో దరఖాస్తులను సమర్పిస్తున్నారు. ఎవరి దగ్గర ఉన్న లెక్కలు వారు చెబుతూ మొత్తంగా ఇంత సంఖ్యలో ఉన్నారని చెబుతున్నారు. ఒకే దరఖాస్తు పలు చోట్లకు పదే పదే తిరుగుతుంది కాబట్టి వాస్తవంగా దరఖాస్తుదారులెందరు. అన్నదానిపై స్పష్టత ఉండటం లేదు. మూడేళు ‌్లగా పెన్షన్ల కోసం ప్రజల నుంచి వస్తున్న దరఖాస్తులు అర్హత కలిగినవో, కావో నిర్ణయించాలంటే ఆన్‌లైన్ చేస్తేనే తెలుస్తుంది. ఆన్‌లైన్ విధానంలో ముందు దరఖాస్తులు స్వీకరిస్తే, ఆరు దశల పరిశీలన (సిక్స్ స్టెప్ట్ వెరిఫికేషన్) చేసే అవకాశం ఉంటుంది. విద్యుత్ బిల్లు వినియోగం, కార్లు, భూములు, ఇతర ఆస్తులు వంటివి ఈ విధానంలో పరిశీలిస్తారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణకు కూడా అవకాశం లేకపోవటంతో ప్రామాణికంగా ఉండటం లేదు.

కొత్త పెన్షన్లకు ప్రభుత్వం అనుమతులు ఇవ్వాల్సిన అవసరం ఉంది. మధ్యలో భర్తలు చనిపోయిన వితంతువుల కోసం అతి స్వల్ప సంఖ్యలో పెన్షన్లు వదిలారు. తర్వాత నియోజకవర్గానికి 200 పెన్షన్లు అవకాశం కల్పించారు. మండలానికే రెండు వేలకు పైగా దరఖాస్తులు ఉన్నప్పుడు. నియోజకవర్గానికి 200 ఏమాత్రం సరిపోయే పరిస్థితి లేదు. ముఖ్యమంత్రి పర్యటనల్లో పెన్షన్ల కోసం అర్జీలు సమర్పించిన వారికి కానీ, జిల్లా స్థాయిలో గ్రీవెన్స్‌కు వచ్చే వారికి అత్యవసరంగా పెన్షన్లు ఇచ్చే నిర్ణయాధికారాలను కలెక్టర్లకు ఇవ్వాల్సిన అవసరం ఉంది. కలెక్టర్లకు అత్యవసర పరిస్థితుల్లో వంద వరకు పెన్షన్లు ఇచ్చే అధికారం కల్పించాలని ముఖ్యమంత్రి ఆదేశించినా.. సెర్ప్ గడప నుంచి మాత్రం ఆ మేరకు ఉత్తర్వులు రావటం లేదు. ఆ దిశగా నిర్ణయాలు తీసుకోవటం లేదు. దీంతో మళ్లీ కలెక్టర్లు తమకు వచ్చిన దరఖాస్తులను ప్రభుత్వానికి పంపిస్తున్నారు.

# పంచాయతీ ఎన్నికలకు సన్నద్ధం!




**అరకు జిల్లా, పతాకం న్యూస్:** రాష్ట్రంలో గ్రామ పంచాయతీల ఎన్నికలకు సన్నద్ధం కావాలని ప్రత్యేక్షంగా రాష్ట్ర ఎన్నికల సంఘం సంకేతాలిచ్చింది. ఈ నెల 2వ తేదీతో పంచాయతీ యాజమాన్యాల ఐదేళ్ల పదవీకాలం పూర్తి కావడంతో పంచాయతీలకు ప్రత్యేకాధికారులను ప్రభుత్వం నియమించింది. కాగా పంచాయతీ ఎన్నికల నిర్వహణపై రాష్ట్ర ఎన్నికల కమిషన్ దృష్టి సారించింది. దీంతో ఈ నెల 15న ప్రతి పంచాయతీ కేంద్రంలో ఓటరు జాబితాల ప్రదర్శన ప్రక్రియను చేపట్టాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్ కలెక్టర్, జిల్లా పంచాయతీ, డివిజనల్ పంచాయతీ అధికారులకు సూచించింది. ఇప్పటికే ఎన్నిలకు సంబంధించిన ఓటరు జాబితాలు, జోన్లు, రూట్లు, తదితర అంశాలపై అధికార యంత్రాంగం సన్నద్ధంగా ఉంది. దీంతో ఎన్నికల నోటిఫికేషన్ జారీ కావడమే తరువాయి అన్నట్టు అటు యంత్రాంగం, ఇటు రాజకీయ పార్టీలు సైతం సిద్ధంగా ఉన్నాయి. గత పంచాయతీ ఎన్నికలు 2021 ఫిబ్రవరి నెలలో నాలుగు విడతల్లో నిర్వహించారు. అయితే ఈ దఫా ఎన్ని విడతల్లో నిర్వహిస్తారనేది ఎన్నికల నోటిఫికేషన్ జారీ అయితేనే స్పష్టత వస్తుంది. గతంలో వలే పంచాయతీ ఎన్నికలు జరుగుతాయని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. జిల్లాలోని పాడేరు, అరకులోయ అసెంబ్లీ స్థానాల పరిధిలో పాడేరు, జి.మాడుగుల, చింతపల్లి, జీకేవీధి, కొయ్యూరు, హుకుంపేట, డుంబ్రిగుడ, అరకులోయ, అనంతగిరి, పెదబయలు, ముంచంగిపుట్టు.. మొత్తం 11 మండలాల్లో 244 గ్రామ పంచాయతీలు, 2,446 వార్డులున్నాయి. అలాగే పురుష ఓటర్లు 2,41,192 మంది, మహిళలు 2,56,732 మంది, ఇతరులు 23 మంది కలిపి మొత్తం 4,97,947 మంది ఉన్నారని అధికారిక లెక్కలు చెబుతున్నాయి. అలాగే ఎన్నికల సమయానికి వాటి సంఖ్య కాస్త పెరిగే అవకాశముందని అధికారులు అంటున్నారు. అలాగే మొత్తం 244 గ్రామ పంచాయతీలను 69 జోన్లు, 105 రూట్‌లుగా విభజించారు. తదుపరి ఎన్నికల కమిషన్ ఆదేశాలు, సూచనలతో పోలింగ్ కేంద్రాలు మినహా మిగతా అంశాల్లో మార్పులు, చేర్పులు ఉండే అవకాశాలున్నాయని అధికారులు అంటున్నారు.

ప్రస్తుతం సర్పంచుల పదవీకాలం ముగియడం, పంచాయతీలు ప్రత్యేకాధికారుల చేతుల్లోకి వెళ్లడం, ఇదే క్రమంలో ఓటరు జాబితాల ప్రదర్శనపై రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేయడంతో రాజకీయ పార్టీల్లోనూ ఉత్సాహం మొదలైంది. దీంతో పంచాయతీల వారీగా తమ బలాలను పార్టీలు బేరీజు వేసుకుంటూ రానున్న పంచాయతీ ఎన్నికల్లో తమ పార్టీ మద్దతుతో ఎవర్ని సర్పంచుగా, వార్డు సభ్యులుగా బరిలోకి దింపాలనే లెక్కల్లో రాజకీయ నేతలు మునిగి తేలుతున్నారు. దీంతో గ్రామాల్లో ఒక మోస్తరుగా రాజకీయ వేడి రాజుకుంటున్నది.

# పొలాలకు కాకుండా పరిశ్రమలకు నీరెలా ఇస్తారు?



**కర్నూలు, పతాకం న్యూస్:** కేసీ కాలువ కింద రైతులు సాగు చేసిన పంటలు నీరు లేక ఎండిపోతున్నా పట్టించుకోని అధికారులు ఎత్తిపోతల నుంచి ఓర్వకల్లులోని పరిశ్రమలకు ఎలా ఇస్తారని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామాంజనేయులు, జిల్లా కార్యదర్శి రంగనాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. ముచ్చుమర్రి ఎత్తిపోతుల నుంచి ఓర్వకల్లులోని పరిశ్రమల కోసం నీరు పంపింగ్ చేసేందుకు నిర్మిస్తున్న పైప్‌లైన్ నిర్మాణం పనులను రాష్ట్ర పరిశ్రమలశాఖ చీఫ్ సెక్రటరీ యువరాజు, నంద్యాల జిల్లా జాయింట్ కలెక్టరు కార్తీక్ ఎత్తిపోతల పథకాన్ని పరిశీలించేందుకు వచ్చారు. అధికారులు ఎత్తిపోతల వద్దకు వస్తున్నారన్న సమాచారం తెలుసుకున్న సీపీఐ నాయకులు, వివిధ గ్రామాలకు చెందిన రైతులు అక్కడికి చేరుకున్నారు. జేసీ వాహనం ఎదుట బైఠాయించి మా నీరు మాకు ఇవ్వకుండా పరిశ్రమలకు తరలించుకుపోవడం అన్యాయమని నినాదాలు చేశారు. జేసీ ఎత్తిపోతల వద్దకు వెళ్తుండగా సీపీఐ నాయకులు, రైతులు చుట్టుముట్టి ఎత్తిపోతల నుంచి 10 రోజుల పాటు నీరు వదిలితే పంటలు చేతికి వస్తాయని, లేదంటే ఆత్మహత్యలు చేసుకోవాల్సి వస్తుందన్నారు. శ్రీశైలం ప్రాజెక్టు నిర్మాణం కోసం సారవంతమైన పొలాలు ఇచ్చి తీవ్రంగా నష్టాపోయామని, తమ ప్రాంతాల్లోని నీటిని ఇతర ప్రాంతాలకు తీసుకొనిపోతే సహించేది లేదన్నారు. జేసీ కార్తీక్ మాట్లాడుతూ ప్రాజెక్టులో నీరు అడుగంటిపోవడంతో మోటార్లకు మట్టి చేరుకొని నీరు విడుదల చేసేందుకు సాధ్యం కాక కేసీ కెనాల్ అధికారులు నీరు నిలిపివేశారని అన్నారు. ఈ సమస్యను కలెక్టరు దృష్టికి తీసుకొనిపోయి న్యాయం చేస్తామని అన్నారు. కేసీ కాలువకు నీరు విడుదల చేయకపోతే హంద్రీనీవా కాలువకు కూడ నీరు నిలిపి వేయలని రైతులు పట్టుబట్టారు. దీంతో జేసీ కలెక్టరుతో ఫోన్‌లో మాట్లాడారు. ఎత్తిపోతలను సందర్శించి కేసీకి నీరు విడుదల చేసేలా చర్యలు తీసుకుంటామని చెప్పడంతో రైతులు వెనుదిరిగిపోయారు.

## భారత్‌లో అమెరికా 'ఫ్రీడమ్ 250' వేడుకలు.. ఢిల్లీ ఆటోలపై ట్రంప్ చిత్రాలు




**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** అమెరికా తన 250వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను భారత్‌లో వినూత్నంగా, ఆకర్షణీయంగా ప్రారంభించింది. దీనికి గుర్తుగా భారత్‌లో అమెరికా రాయబారి సెర్గియో గోర్ ఢిల్లీలో 'ఫ్రీడమ్250' సంబరాలకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చిత్రాలు, అమెరికా జాతీయ చిహ్నాలతో అలంకరించిన ప్రత్యేక ఆటో రిక్షాలను ఆయన ఆవిష్కరించారు. 1776 జులై 4న అమెరికా స్వాతంత్ర్య ప్రకటనపై సంతకాలు చేసి 250 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా, 2026 జులై 4 వరకు ఈ వేడుకలను ఘనంగా నిర్వహించనున్నారు. దీనిలో భాగంగా భారత్‌లో ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ విషయాన్ని రాయబారి సెర్గియో గోర్ తన అధికారిక ఎక్స్ (ట్విట్టర్) ఖాతాలో పంచుకున్నారు. "ఢిల్లీ నుంచి చఖీతీవవసశీఎ250 వేడుకలను ప్రారంభించడం ఎంతో ఆనందంగా ఉంది. ఈ ప్రత్యేక ప్రయాణానికి గుర్తుగా నగరం అంతా తిరిగేందుకు అధ్యక్షుడు ట్రంప్, అమెరికన్ చిహ్నాలతో కూడిన ఆటోలను సిద్ధం చేశాం. అమెరికా 250వ వార్షికోత్సవాన్ని జరుపుకుంటూనే, భారత్-అమెరికా మధ్య ఉన్న బలమైన భాగస్వామ్యాన్ని కూడా గౌరవిస్తున్నాం" అని ఆయన పేర్కొన్నారు. భారత్‌లో ప్రజాదౌత్యంలో భాగంగా చేపట్టిన ఈ వినూత్న ప్రచారం అందరినీ ఆకట్టుకుంటోంది. ఢిల్లీ వీధుల్లో నిత్యం రద్దీగా తిరిగే ఆటోలను, రెండు దేశాల మధ్య స్నేహబంధానికి ప్రచార వేదికలుగా మార్చారు. ఈ ఆటోలు ఢిల్లీ వీధుల్లో తిరుగుతూ, ఇరు దేశాల మధ్య ఉన్న సంబంధాల ప్రాముఖ్యతను ప్రజలకు తెలియజేస్తాయి. ఢిల్లీ తర్వాత దేశంలోని ఇతర ప్రధాన నగరాల్లో కూడా ఈ ఆటోలు పర్యటించనున్నాయి. ట్రంప్ వద్ద అధ్యక్షుడి సహాయకుడిగా పనిచేసిన సెర్గియో గోర్, ఈ ఏడాది జనవరిలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు తన పత్రాలను సమర్పించి బాధ్యతలు చేపట్టారు. రక్షణ, వాణిజ్యం, సాంకేతికత, కీలక ఖనిజాలు, భద్రత వంటి రంగాల్లో ద్వైపాక్షిక సంబంధాలను మరింత పటిష్టం చేయడంపై ఆయన దృష్టి సారించారు. ఈ 'ఫ్రీడమ్250' కార్యక్రమం కేవలం అమెరికా వేడుక మాత్రమే కాదని, భారత్‌తో తమకున్న బలమైన వ్యూహాత్మక భాగస్వామ్యానికి ప్రతీక అని రాయబార కార్యాలయ వర్గాలు తెలిపాయి. ఈ ప్రచారం ద్వారా రెండు దేశాల మధ్య ఉన్న స్నేహం, సహకారం, పరస్పర గౌరవం వంటి విలువలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

## చేనేత కార్మికుల పోరాటానికి సీపీఎం మద్దతు



**కాకినాడ, పతాకం న్యూస్:** ఆంధ్రప్రదేశ్ చేనేత సహకార సంఘాల జెఎసి, ఆల్ ఇండియా వీవర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద జరిగిన ఆత్మ గౌరవ దీక్షకు సిపిఎం మద్దతు ప్రకటించింది. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి కరణం ప్రసాదరావు మాట్లాడుతూ ప్రభుత్వ విధానం వలన రోజు రోజుకు చేనేత కార్మికుల పరిస్థితి దిగజారిపోతుందన్నారు. ఆకలి బాధలతో అలమటిస్తూ జీవితాలు గడుపుతున్నారన్నారు. ఆరేళ్లుగా రాష్ట్రంలోని చేనేత సహకార సంఘాలకు ఆప్కో, ప్రభుత్వం చెల్లించవలసిన రూ.203 కోట్ల బకాయిలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆప్కో చేనేత సహకార సంఘాలకు ముడిసరుకు ఇచ్చి పూర్తిస్థాయిలో పని కల్పించాలని, సహకార సంఘాల వద్ద ఉన్న వస్త్ర నిల్వలను ఆప్కో పూర్తిగా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. చేనేత సహకార సంఘాలకు, ఆప్కోకు తక్షణమే ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కెఎస్.శ్రీనివాస్, కె.వీరబాబు, కె.సింహాచలం, కె.సత్తిరాజు, భూలక్ష్మి, యు.సత్యనారాయణ, టి. రాణి, కె.పద్మనాభం పాల్గొని మద్దతు ప్రకటించారు.

## పారిశుధ్య మెరుగుకు చర్యలు

**నరసాపురం, పతాకం న్యూస్:** నరసాపురం పట్టణంలో పారిశుధ్య పరిస్థితులను మెరుగుపర్చేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. పట్టణంలో నెలకొన్న చెత్త నిర్వహణ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు చర్యలు ప్రారంభించామని, త్వరలోనే స్పష్టమైన ఫలితాలు కనిపిస్తాయని ఆమె పేర్కొన్నారు. నరసాపురం రుస్తుంబాద శివారు మండవారి గరువు ప్రాంతంలో ప్రభుత్వ భూములను కలెక్టర్ చదలవాడ నాగరాణి స్వయంగా పరిశీలించారు. ఈ పర్యటనలో రెవెన్యూ, మున్సిపల్ అధికారులతో కలిసి స్థలాల పరిస్థితిని క్షేత్రస్థాయిలో సమీక్షించారు. డంపింగ్ యార్డ్ ఏర్పాటుకు అనువైన ప్రభుత్వ స్థలాలను గుర్తించేందుకు అధికారులు వివరాలను సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ పట్టణ పారిశుధ్య సమస్యలను సమర్థవంతంగా పరిష్కరించేందుకు సమన్వయంతో పని చేయాలని అధికారులను ఆదేశించారు. డంపింగ్ యార్డ్ ఏర్పాటుకు అనుకూలమైన స్థలాన్ని గుర్తించి, నిర్దేశిత విధానాల ప్రకారం పనులు వేగవంతం చేయాలని సూచించారు. మండవారి గరువులో డంపింగ్ యార్డ్ కోసం ఏర్పాటు చేసిన రహదారిని కూడా పరిశీలించారు.

## భారత్‌లోకి 800 మంది ఉగ్రవాదులను పంపేందుకు పాక్ భారీ కుట్ర: భారత నిఘా వర్గాలు



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** జమ్మూ కశ్మీర్‌లో మరోసారి అలజడి సృష్టించేందుకు పాకిస్థాన్ భారీ కుట్రకు తెరలేపింది. సుమారు 800 మంది ఉగ్రవాదులను భారత్‌లోకి పంపేందుకు పాక్ నిఘా సంస్థ ఐఎస్ఐ, ఆ దేశ సైన్యం ప్రణాళికలు రచిస్తున్నట్లు భారత నిఘా వర్గాలు బుధవారం హెచ్చరించాయి. దీని కోసం నియంత్రణ రేఖ (ఎల్ఓసీ), అంతర్జాతీయ సరిహద్దు వెంబడి సుమారు 70 ఉగ్రవాద లాంచ్‌ప్యాడ్‌లను పునరుద్ధరించినట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుతం ప్రపంచ దేశాల దృష్టి మధ్యప్రాచ్య సంక్షోభంపై కేంద్రీకృతమై ఉండటం, అదే సమయంలో భారత్‌లో పలు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతుండటంతో ఇదే అదునుగా భావించి పాక్ ఈ కుట్రకు పాల్పడుతోందని ఓ అధికారి తెలిపారు. ఈ అవకాశాన్ని వాడుకొని భారీ ఎత్తున ఉగ్రవాదులను కశ్మీర్‌లోకి పంపాలని ఐఎస్ఐ, పాక్ సైన్యం భావిస్తున్నట్లు నిఘా వర్గాలు పేర్కొన్నాయి. పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని లాంచ్‌ప్యాడ్‌లకు ఇప్పటికే పెద్ద సంఖ్యలో ఉగ్రవాదులను తరలించి, చొరబాటుకు సిద్ధంగా ఉంచారని సమాచారం. ఇటీవలి కాలంలో భారత భద్రతా బలగాల అప్రమత్తతతో పలు చొరబాటు యత్నాలు విఫలమయ్యాయి. దీంతో పాక్ తన వ్యూహాన్ని మార్చుకుంది. ఇప్పుడు ఒకేసారి పలు ప్రాంతాల నుంచి 10 నుంచి 15 మంది చొప్పున ఉగ్రవాదుల బృందాలను పంపి, భద్రతా బలగాల దృష్టిని మరల్చాలని చూస్తోంది. ఈ పద్ధతిలో కనీసం కొందరైనా లోపలికి ప్రవేశించగలరని వారు భావిస్తున్నారు. గతేడాది భారత బలగాలు నిర్వహించిన 'ఆపరేషన్ సిందూర్' తర్వాత ఉగ్రవాద మౌలిక సదుపాయాలు దెబ్బతినడంతో పాక్‌పై ఒత్తిడి పెరిగింది. దీంతో కశ్మీర్‌లో కార్యకలాపాలు నిలిచిపోవడంపై లష్కరే తోయిబా వంటి ఉగ్రవాద సంస్థల నుంచి ఐఎస్ఐపై ఒత్తిడి వస్తున్నట్లు తెలుస్తోంది. స్థానిక నెట్‌వర్క్‌లు బలహీనపడటంతో, సరిహద్దుల నుంచి శిక్షణ పొందిన, యుద్ధ నైపుణ్యం ఉన్న ఉగ్రవాదులను పంపి భారీ దాడులకు పాల్పడాలని ఐఎస్ఐ యోచిస్తున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.

# రోజంతా కళ్లద్దాలు పెట్టుకోవటం మంచిదేనా?



శరీరంలోని సున్నితమైన అవయవాల్లో 'కళ్లు' ముఖ్యమైనవి. అవి ఆరోగ్యంగా ఉంటేనే, రోజూ ప్రపంచాన్ని చూడగలుగుతాం. మరి, ఇంతటి అమూల్యమైన చూపును ప్రసాదించే కళ్లపై ప్రత్యేక శ్రద్ధ వహించలేకపోతున్నాం. ఎందుకంటే, కళ్ల గురించి, చూపును దెబ్బతీసే అంశాల గురించి చాలా మందికి సరైన అవగాహన లేకపోవడమే. పైగా ఎన్నెన్నో అపోహలూ రాజ్యమేలుతున్నాయి. ఈ క్రమంలో కంటి చూపుపై ఉన్న అపోహలు, వాటి వెనకున్న వాస్తవాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం!

తక్కువ వెలుతురులో చదివితే చూపు తగ్గిపోతుందని చాలా మంది అనుకుంటుంటారు. ఇది వాస్తవం కాదు. మసక వెలుతురులో చదవడం వల్ల కళ్లు అలసిపోయినట్లు అనిపించవచ్చు, కానీ అది హానికరం కాదని అధ్యయనం పేర్కొంది. కాబట్టి, పుస్తకం మీద నేరుగా వెలుతురు పడేలా లైటును అమర్చుకొని చదువుకోవడం మంచి పద్ధతి అని సూచిస్తున్నారు. కంటి ఆరోగ్యానికి క్యారెట్లను మించినవి లేవనేది కొంతమంది భావన. ఆరోగ్యకరమైన కంటి చూపును నిర్వహించడానికి శరీరానికి విటమిన్ ఎ చాలా అవసరం. క్యారెట్లలో ఈ పోషకం అధిక మొత్తంలో ఉంటుంది. కానీ శరీరానికి దృష్టికి విటమిన్ ఎ చాలా తక్కువ మొత్తంలో మాత్రమే అవసరమని అధ్యయనం పేర్కొంది . దీనిని ముదురు ఆకుకూరలు, ముదురు రంగు కూరగాయలు, పాలు, చేపలు వంటి అనేక వనరుల ద్వారా పొందవచ్చని తెలిపింది. విటమిన్ ఎ అధికంగా ఉండే ఆహారాన్ని తినడం వల్ల కంటి చూపును కాపాడుకోవచ్చని, కానీ అది దృష్టిని మెరుగుపరచదు లేదా అద్దాలు లేదా కాంటాక్ట్ లెన్సులు అవసరం రాకుండా చేస్తుందని చెబుతుంది. ఇవి వయసుతో పాటు దాడిచేసే శుక్లాలు, రెటీనా మధ్యభాగం క్షీణించటం వంటి సమస్యల బారినపడకుండానూ కాపాడతాయంటున్నారు నిపుణులు. కాంటాక్ట్ లెన్సులు లేదా కళ్లద్దాలను రోజంతా పెట్టుకోవటం మంచిది కాదని, దీంతో కళ్లు వాటికి అలవాటు పడిపోతాయనేది మరికొందరి అపోహ. ఇందులో ఏ మాత్రం నిజం లేదం టున్నారు నిపుణులు. హ్రస్వదృష్టి , దూరదృష్టి , ఆస్టిగ్మాటిజం లేదా ప్రెస్బియోపియాను సరిచేయడానికి ధరించే కళ్లద్దాలు కళ్లను బలహీనపరచవని అధ్యయనం పేర్కొంది. మామూలుగా వయసు మీద పడటం, జబ్బుల మూలంగానో కంటి అద్దాల పవర్ మారుతుంటుందని తెలియజేస్తున్నారు. అప్పుడు కొత్త అద్దాలు తీసుకోవాల్సి వస్తుందని వివరిస్తున్నారు. అంతే తప్ప కళ్లద్దాలు, లెన్సులతో చూపు తగ్గటం, కళ్లు దెబ్బతినటం వంటి ముప్పులేవీ ఉండవని పేర్కొంటున్నారు. సరైన కళ్లద్దాలు ధరించడం వల్ల కూడా కంటి ఒత్తిడి తగ్గుతుందని %ఔఝంష్త్రబ వీవసఱఅషఱఅవ% అధ్యయనం పేర్కొంది. అదే పనిగా కంప్యూటర్ వైపు చూడటం కళ్లకు ప్రమాదకరమని ఇంకొందరు భావి స్తుంటారు. అయితే ఇది నిజం కాదని, స్క్రీన్ వైపు గంటలకొద్దీ చూడటం వల్ల కళ్లు అలసి పోవటం, ఒత్తిడికి లోనవటం సహజమే గానీ చూపేమీ దెబ్బతినదని నిపుణులు అంటున్నారు. అయితే, ఎక్కువసేపు కంప్యూటర్ ముందు కూచోవాల్సి వస్తే 20-20-20 సూత్రాన్ని పాటించాలని సూచిస్తున్నారు. ఎలాగంటే, ప్రతి 20 నిమిషాలకు ఒకసారి 20 సెకండ్ల పాటు 20 అడుగుల దూరంలోని దృశ్యాలను చూడటం అలవాటు చేసుకోవాలని చెబుతున్నారు. అలాగే తరచుగా కంటి రెప్పలను ఆడిస్తూ ఉండాలని సలహా ఇస్తున్నారు. దీంతో కళ్లు పొడిబారకుండా చూసుకోవచ్చని పేర్కొంటున్నారు. కంటి వ్యాయామాలు చేస్తే కళ్లద్దాలు ధరించాల్సిన అవసరం ఉండదని కొందరు అనుకుంటుంటారు. కంటి వ్యాయామాలతో కంటి కండరాలు బలోపేతం అవుతాయని, కానీ తగ్గిపోయిన చూపు తిరిగి మామూలు స్థాయికేమీ రాదంటున్నారు నిపుణులు. కంటి ఆకృతి, కంటి కణజాలం వంటి వ్యాయామాలతో మారిపోవని తెలియజేస్తున్నారు.

కంటి వ్యాయామాలు దృష్టిని మెరుగుపరచడం లేదా సంరక్షించడం లేదా అద్దాల అవసరాన్ని తగ్గించడం వంటివి జరగవని అధ్యయనం పేర్కొంది. ఈ క్రమంలో చూపు తగ్గటాన్ని ఎవరు ఆపలేరని కొంతమంది అనుకుంటుంటారు. కానీ చూపు మసకబారటం, కంటి నొప్పి, మిరుమిట్లు గొలిపే కాంతులు మెరవటం వంటి లక్షణాలు కనబడితే వెంటనే డాక్టర్?ను సంప్రదించాలని నిపుణులు సూచిస్తున్నారు. కారణాన్ని వీలైనంత త్వరగా గుర్తిస్తే తగు చికిత్సలతో సరి చేయొచ్చని అంటున్నారు. కనీసం చూపు తగ్గటాన్నయినా నెమ్మదింపజేయొచ్చని తెలియజేస్తున్నారు.

# రాయితీ యంత్ర పరికరాల నాణ్యతపై పలు సందేహాలు?



**విజయనగరం, పతాకం న్యూస్:** ట్రైకార్ పథకంలో భాగంగా గిరిజన ఉపప్రణాళిక నిధులతో 90శాతం రాయితీపై పంపిణీ చేయనున్న యంత్ర పరికరాల నాణ్యతపై పలు సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈప్రాంత గిరిజన రైతులకు అవి ఎంతవరకు ఉపయోగపడ తాయన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఇప్పటివరకు ఎవరూ వినని, కనని కంపెనీలకు చెందిన మినీట్రాక్టర్లు, హార్స్‌పవర్ చాలని పవరటిల్లర్లు కొద్దిరోజుల కిందటే సీతంపేట ఐటీడీఏకు చేరుకున్నాయి. వాస్తవంగా గిరిజన రైతుల డిమాండ్ మేరకు ఐటీడీఏ హార్టికల్చర్ అధికారులు యంత్ర పరికరాల కోసం ఇండెంట్‌ను ప్రతిపాదించారు. అయితే వీరి ప్రతిపాదనలను పక్కకు పెట్టి అక్కరకు రాని యంత్ర పరికరాలు సరఫరా అయ్యాయనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. జిల్లాలో రెండు ఐటీడీఏలకు ఆయిల్ ఇంజన్లు, పవర్‌టిల్లర్లు, పవర్ వీడర్, మినీట్రాక్టర్లు, మల్టీక్రాప్ ట్రెషర్స్ వంటి వ్యవసాయ యంత్ర పరికరాలు సరఫరా అయ్యాయి. సీతంపేట ఐటీడీఏకు రూ.3.34 కోట్లు, పార్వతీపురం ఐటీడీఏకు రూ.3.55కోట్లతో ఈ వ్యవసాయ పరికరాలను సెంట్రలైజ్డ్ టెండర్ల విధానం ద్వారా సరఫరా చేశారు. తురాయిపువలస ఉద్యాన నర్సరీలో ఉన్న వాటిని చూసి గిరిజన రైతులు సైతం ఆశ్చర్యానికి గురవుతున్నారు. తామెప్పుడూ వాటి కంపెనీల పేర్లు వినలేదని చెబుతున్నారు. అర్హులైన గిరిజన రైతులకు ఐటీడీఏ ద్వారా 90శాతం రాయితీతో పంపిణీ చేయనున్న 25 మినీట్రాక్టర్లు ప్రముఖ కంపెనీల (స్వరాజ్,మహీంద్రా, సోనాలిక,జాన్‌డీర్)కు చెందినవి కావు. కెప్టెన్ కంపెనీకి చెందిన వాటిని సరఫరా చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ కెప్టెన్ కంపెనీకి చెందిన ఒక్కో మినీట్రాక్టర్ ధర రూ.5.60లక్షలు. ఇదే ధరకు ప్రముఖ కంపెనీలకు చెందిన మినీట్రాక్టర్లను కొనుగోలు చేసి పంపిణీ చేయొచ్చు. కానీ అలా చేయకపోవడంపై సందేహాలు వ్యక్తమవు తున్నాయి. కాగా కెప్టెన్ కంపెనీకి చెందిన మినీట్రాక్టర్ల సర్వీసింగ్ సెంటర్‌లు పార్వతీపురం, శ్రీకాకుళం జిల్లాల్లో ఎక్కడ లేవని గిరిజన రైతులు చెబుతున్నారు. ఇక రాయితీ కింద అందించనున్న పవర్ టిల్లర్ యంత్రాలు పరిస్థితి కూడా అదేవిధంగా ఉంది. అధికారులు పంపిన ఇండెంట్ ప్రాప్తికి 15హెచ్‌పీ(హార్స్‌పవర్) కలిగిన వాటిని సప్లయ్ చేయాల్సి ఉంది. కానీ సీతంపేట ఐటీడీఏకు 13హెచ్‌పీ పవర్ కలిగిన 28 పవర్‌టిల్లర్లు సరఫరా చేశారు. పార్వతీపురం ఐటీడీఏకు కూడా 5హెచ్‌పీ (హార్స్‌పవర్)కలిగిన ఆయిల్ ఇంజన్‌లు సరఫరా చేయాల్సి ఉండగా 3హెచ్‌పీ పవర్ కలిగిన 14ఆయిల్ ఇంజన్‌లు సరఫరా చేసినట్లు తెలుస్తోంది. మొత్తంగా యంత్ర పరికరాల పంపిణీకి ముందే డొల్లతనం బయటపడుతోంది.

ఈ సెంట్రలైజ్డ్ టెండర్‌ల ప్రక్రియలో రాష్ట్రస్థాయిలోని ట్రైకార్ విభాగంలో ఓ కీలక అధికారి చక్రం తిప్పినట్లు తెలుస్తోంది. పార్వతీపురం, సీతంపేట ఐటీడీఏల పరిధిలోని గిరిజన రైతులకు ఈ యంత్ర పరికరాలను ఇంకా పంపిణీ చేయకుండానే వీటికి సంబంధించిన పేమెంట్‌లు క్లియర్ చేయాలని ఉన్నతాధికారుల నుంచి ఇక్కడ ఐటీడీఏ సిబ్బందికి ఒత్తిళ్లు వస్తున్నట్లు తెలుస్తోంది. దీనిపై ప్రభుత్వం స్పందించి గిరిజన రైతులకు అవసరమైన వ్యవసాయ యంత్ర పరికరాలు సరఫరా జరిగేలా చూడాలని గిరిజన సంఘాల నాయకులు కోరుతున్నారు.

## మరో రెండు రోజుల్లో అమెరికా-ఇరాన్ రెండో విడత చర్చలు: ట్రంప్



న్యూయార్క్: అమెరికా, ఇరాన్ మధ్య మరోసారి చర్చలు ప్రారంభమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. రాబోయే రెండ్రోజుల్లోనే ఈ పరిణామం చోటుచేసుకోవచ్చని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ చర్చలు పాకిస్థాన్‌లో జరిగేందుకే తాము మొగ్గు చూపుతున్నట్లు ఆయన తెలిపారు. న్యూయార్క్ పోస్ట్‌కు ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో ట్రంప్ ఈ విషయం వెల్లడించారు. "రాబోయే రెండ్రోజుల్లో ఏదైనా జరగవచ్చు. మేము అక్కడికి (పాకిస్థాన్‌కు) వెళ్లడానికే మొగ్గు చూపుతున్నాం" అని ట్రంప్ పేర్కొన్నారు. ఈ చర్చల విషయంలో పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ ఫీల్డ్ మార్షల్ అసిమ్ మునీర్ అద్భుతంగా పనిచేస్తున్నారని, ఆయన అద్భుతమైన వ్యక్తి అని ప్రశంసించారు. అందుకే మళ్లీ అక్కడికే వెళ్లే అవకాశం ఉందని అన్నారు. ఇటీవల వారాంతంలో పాకిస్థాన్‌లోని ఇస్లామాబాద్ వేదికగా అమెరికా-ఇరాన్ దేశాల మధ్య చర్చలు జరిగాయి. ఈ సమావేశంలో అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మహమ్మద్ బఘేర్ ఘలీబాఫ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు. అయితే, ఆ చర్చల్లో ఎలాంటి ఒప్పందం కుదరలేదు. మరోవైపు, టెహ్రాన్, పాకిస్థాన్ మధ్య సందేశాలు మార్పిడి జరిగినట్లు ఇరాన్ ప్రభుత్వ మీడియా తెలిపింది. కానీ, అమెరికాతో మలివిడత చర్చలు జరపడంపై తమ వద్ద ఎలాంటి సమాచారం లేదని స్పష్టం చేసింది. దీంతో చర్చల పునరుద్ధరణపై ఉత్కంఠ కొనసాగుతోంది.

ఇరాన్‌తో అణు కార్యక్రమంపై జరిపిన చర్చల్లో గణనీయమైన పురోగతి సాధించామని, అయితే కీలకమైన డిమాండ్ల విషయంలో వాషింగ్టన్ తన నిర్ణయాలకు కట్టుబడి ఉండడంతో ఒప్పందం కుదరలేదని అమెరికా వైస్ ప్రెసిడెంట్ జేడీ వాన్స్ తెలిపారు. పాకిస్థాన్‌లో అత్యున్నత స్థాయిలో జరిగిన ఈ చర్చలు ఫలప్రదం కాలేదని ఆయన స్పష్టం చేశారు. ఫాక్స్ న్యూస్‌కు ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో ఆయన ఈ విషయాలను వెల్లడించారు. అమెరికా, ఇరాన్ ప్రభుత్వాలు ఇంత ఉన్నత స్థాయిలో సమావేశమవడం ఇదే మొదటిసారని ఆయన పేర్కొన్నారు. చర్చల్లో కొన్ని సానుకూల అంశాలు ఉన్నప్పటికీ, ఇరాన్ తమ డిమాండ్లకు తగినంతగా స్పందించలేదని వాన్స్ అన్నారు. "ఇరాన్ ఎప్పటికీ అణ్వాయుధాన్ని కలిగి ఉండకూడదు" అనేదే తమ ప్రధాన సూత్రమని ఆయన తెలిపారు. దీనికోసం రెండు కఠినమైన షరతులను ఇరాన్ ముందు ఉంచినట్లు వివరించారు.




## రెండు మ్యాచ్‌లకు రోహిత్ శర్మ దూరం!



ఐపీఎల్ 2026లో వరుస ఓటములతో ఇప్పటికే కష్టాల్లో ఉన్న ముంబై ఇండియన్స్‌కు భారీ షాక్ తగిలింది. స్టార్ ప్లేయర్ రోహిత్ శర్మ గాయం బారిన పడిన సంగతి తెలిసిందే. దీంతో అతడు రెండు మ్యాచ్‌లకు దూరమయ్యే అవకాశం ఉన్నట్లు సమాచారం. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టుతో మ్యాచ్ జరుగుతున్న సమయంలో రోహిత్ కండరాలు పట్టేయడంతో రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగాడు. ఆ మ్యాచ్‌లో 241 పరుగుల లక్ష్య ఛేదనలో ముంబై 222కే పరిమితమైంది. రోహిత్ శర్మ ఆర్సీబీపై 13 బంతుల్లో 19 పరుగులు చేశాడు. ఈ సీజన్‌లో ఎంఐ ఆడిన నాలుగు మ్యాచుల్లో మూడు ఓడి పాయింట్ల పట్టికలో 9వ స్థానంలో కొనసాగుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో స్టార్ ప్లేయర్ రోహిత్ శర్మ లోటు ముంబైకి మరింత తలనొప్పిగా మారనుంది. కండరాలు పట్టేయడంతో మైదానాన్ని వీడిన తర్వాత రోహిత్ శర్మ స్కానింగ్ తీయించుకున్న సంగతి తెలిసిందే. ఆ మెడికల్ రిపోర్ట్ ప్రకారం ఎలాంటి చీలిక లేదని తేలింది. గాయం మరీ పెద్దది కాకపోవడంతో మరిన్ని మ్యాచ్‌లకు దూరమయ్యే అవకాశం ఉండదని అభిమానులు ఆశించారు. అయితే ఏప్రిల్ 16న పంజాబ్ కింగ్స్, ఏప్రిల్ 20న గుజరాత్ టైటాన్స్‌తో జరిగే మ్యాచ్‌లకు రోహిత్ శర్మ దూరమయ్యే అవకాశం ఉంది. ఇప్పటివరకు నాలుగు మ్యాచ్‌ల్లో 137 పరుగులు చేసిన రోహిత్, ఒక అర్ధ శతకం నమోదు చేశాడు. మంచి ఫామ్‌లో కనిపిస్తున్న సమయంలో గాయం బారిన పడటం జట్టుకు పెద్ద లోటుగా మారింది. ఈ ఐపీఎల్ సీజన్‌ను గెలుపుతో ప్రారంభించిన ముంబై.. ఆ తర్వాత వరుసగా మూడు మ్యాచ్‌లు ఓడిపోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. పవర్‌ప్లేలో వైఫల్యం జట్టును తీవ్రంగా ప్రభావితం చేస్తోంది. ఇక బౌలింగ్ విభాగంలోనూ ఆశించిన ఫలితాలు రావడం లేదు. ముఖ్యంగా స్టార్ పేసర్ బుమ్రా.. ఇప్పటి వరకు వికెట్ల ఖాతా తెరవకపోవడం గమనార్హం. అతనితో పాటు ట్రెంట్ బౌల్ట్, హార్దిక్ పాండ్య ఉన్నప్పటికీ బౌలింగ్‌లో ప్రభావం చూపడం లేదు. ముంబై ఇండియన్స్ ప్లే ఆఫ్స్‌కు చేరుకోవాలంటే ఇక నుంచి ప్రతి మ్యాచ్‌లోనూ గెలవాల్సిందే.

## చెన్నై సూపర్ కింగ్స్‌కి రెండో విజయం



మాజీ చాంపియన్ కోల్‌కతా నైట్‌రైడర్స్ పరాజయాల పరంపర కొనసాగుతూనే ఉంది. అటు సొంతగడ్డపై చెన్నై సూపర్ కింగ్స్ మరోసారి చక్కటి ప్రదర్శనతో ఆకట్టుకుంది. ఈ మ్యాచ్‌లో బ్యాటు, బంతితో అదరగొట్టిన చెన్నై 32 పరుగులతో కోల్‌కతాపై గెలిచింది. మరోవైపు నైట్‌రైడర్స్ ఆడిన ఐదు మ్యాచ్‌ల్లోనూ నాలుగింట్లో ఓడగా.. ఓ మ్యాచ్ రద్దయ్యింది. ముందుగా చెన్నై 20 ఓవర్లలో 5 వికెట్లకు 192 పరుగులు చేసింది. సంజూ శాంసన్ (32 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్సర్లతో 48), బ్రెవిస్ (29 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్సర్లతో 41), ఆయుష్ మాత్రే (17 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్సర్లతో 38) రాణించారు. కార్తీక్ త్యాగికి రెండు వికెట్లు దక్కాయి. ఛేదనలో కోల్‌కతా 20 ఓవర్లలో 160/7 స్కోరుకే పరిమితమై ఓడింది. రమణ్‌దీప్ (23 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్‌తో 35), పోవెల్ (31 నాటౌట్), రహానె (28), రఘువంశీ (27) ఫర్వాలేదనిపించారు. 3 వికెట్లు తీసిన చెన్నై స్పిన్నర్ నూర్ అహ్మద్ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచాడు.

ఛేదనలో కేకేఆర్ బ్యాటర్లు తడబడ్డారు. పేసర్లు ఖలీల్, అన్షుల్ ఆరంభంలో ఇబ్బందిపెట్టగా.. మధ్య ఓవర్లలో నూర్ కీలక వికెట్లతో కుదురుకోనీయలేదు. ఓపెనర్‌గా బరిలోకి దిగిన నరైన్ (24) ఉన్న కాసేపు బ్యాట్ ఝుళిపించాడు. మరో ఓపెనర్ అలెన్ (1) నిరాశపర్చాడు. కెప్టెన్ రహానె, రఘువంశీ మాత్రం మూడో వికెట్‌కు 50 రన్స్ జోడించారు. రహానె, గ్రీన్ (0)లను వరుస బంతుల్లో నూర్ అవుట్ చేయడం మరింతగా దెబ్బతీసింది. రింకూ (6)ను కూడా నూర్ పెవిలియన్‌కు చేర్చడంతో కేకేఆర్ 90/6 స్కోరుతో ఇబ్బందుల్లో పడింది. అటు సాధించాల్సిన రన్‌రేట్ భారీగా పెరగడంతో చివర్లో పోవెల్, రమణ్‌దీప్ పోరాటం సరిపోలేదు. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన చెన్నై ఇన్నింగ్స్ వేగంగా ఆరంభమైంది. మొదటి మూడు బంతులనే ఓపెనర్ శాంసన్ ఫోర్లుగా మలిచి స్టేడియంలో జోష్ నింపాడు. మరో ఓపెనర్, కెప్టెన్ రుతురాజ్ (7) మాత్రం వరుసగా ఐదో మ్యాచ్‌లోనూ విఫలమయ్యాడు. అయితే ఆయుష్ మాత్రే వచ్చీ రాగానే బ్యాట్ ఝుళిపించాడు. క్రీజులో ఉన్నంతసేపు బౌండరీలపైనే దృష్టి సారించాడు. నాలుగో ఓవర్‌లో మాత్రే 4,4,6,6తో 21 రన్స్ రాబట్టాడు. ఇక ఆరో ఓవర్‌లోనూ హ్యాట్రిక్ ఫోర్లతో జోరు చూపించినా.. అదే ఓవర్ ఆఖరి బంతికి మాత్రేను వైభవ్ అవుట్ చేశాడు. దీంతో రెండో వికెట్‌కు 47 పరుగుల భాగస్వామ్యం ముగిసినా.. పవర్‌ప్లేలో చెన్నై 72/2తో పటిష్టంగా కనిపించింది. కానీ స్పిన్నర్లు నరైన్, వరుణ్ రాకతో మధ్య ఓవర్లలో జట్టు స్కోరు నెమ్మదించింది. పేసర్ కార్తీక్ త్యాగి సైతం పదునైన బంతులతో కట్టడి చేశాడు. 12వ ఓవర్‌లో శాంసన్‌ను కార్తీక్ బౌల్డ్ చేశాడు. ఈ దశలో బ్రెవిస్‌కు సర్ఫరాజ్ (23) జత కలవడంతో స్కోరులో కదలిక వచ్చింది. 14వ ఓవర్‌లో సర్ఫరాజ్ 6, బ్రెవిస్ 4,4తో 15 రన్స్ రాబట్టగా.. 16వ ఓవర్‌లో బ్రెవిస్ 6,4, సర్ఫరాజ్ 4తో 20 రన్స్ సమకూరాయి. దీంతో స్కోరు కూడా 150 దాటింది. కానీ డెత్ ఓవర్లలో పుంజుకొన్న కేకేఆర్ బౌలర్లు వరుస ఓవర్లలో సర్ఫరాజ్, బ్రెవిస్‌ను పెవిలియన్‌కు చేర్చడంతో నాలుగో వికెట్‌కు 51 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఇక, శివమ్ దూబే (13 నాటౌట్) క్రీజులో ఉన్నా చివరి మూడు ఓవర్లలో చెన్నై 23 పరుగులే చేసింది. దీంతో ఈ జట్టు స్కోరు 200లోపే ముగిసింది.




# అల్లు అర్జున్‌తో అట్లీ సరికొత్త ప్రయోగం



ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, సెన్సేషనల్ డైరెక్టర్ అట్లీ కాంబినేషన్‌లో వస్తున్న రాకా చిత్రం ప్రస్తుతం టాలీవుడ్‌తో పాటు ఇండియన్ సినిమా దగ్గర హాట్ టాపిక్‌గా మారింది. ఈ భారీ ప్రాజెక్ట్‌లో బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పదుకోన్ కథానాయికగా నటిస్తుండటంతో అంచనాలు అమాంతం పెరిగిపోయాయి. ఇటీవల విడుదలైన షాకింగ్ ఫస్ట్ లుక్ పోస్టర్ సోషల్ మీడియాను షేక్ చేయడమే కాకుండా, సినిమాపై భారీ హైప్‌ను క్రియేట్ చేసింది. పోస్టర్‌లో బన్నీ లుక్ చూస్తుంటే ఆయన కెరీర్‌లోనే ఇది ఒక విభిన్నమైన సాహసోపేతమైన పాత్ర అని స్పష్టమవుతోంది.

తాజాగా ఈ సినిమా స్టోరీకి సంబంధించి ఓ క్రేజ్ బజ్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. అట్లీ సినిమాతో ఒక సరికొత్త ప్రయోగానికి తెరలేపుతున్నట్లు తెలుస్తోంది. ఈ చిత్రంలో సైన్స్ ఫిక్షన్ ఎలిమెంట్స్ ఉండటంతో పాటు పురాణాల నేపథ్యం (మైథాలజీ టచ్) కూడా ఉంటుందని సమాచారం. ముఖ్యంగా ‘తోడేళ్ళ’కు సంబంధించి మన పురాణాల్లో ఉన్న కొన్ని ఆసక్తికరమైన అంశాలను ఆధారం చేసుకొని అట్లీ ఈ కథను సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. సైన్స్ ఫిక్షన్, మైథాలజీ అనే ఈ రెండు విభిన్న అంశాలను దర్శకుడు ఎలా కలపబోతున్నారనేది ఇప్పుడు అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. గతంలో అట్లీ తన సినిమాల్లో ఎమోషన్స్, మాస్ ఎలిమెంట్స్ పర్ఫెక్ట్‌గా బ్యాలెన్స్ చేసేవారు. అయితే ఈసారి ఆయన ఎంచుకున్న థీమ్ మాత్రం చాలా కొత్తగా ఉంది. తోడేళ్ళ కాన్సెప్ట్ చుట్టూ తిరిగే ఈ మైథలాజికల్ సైన్స్ ఫిక్షన్ డ్రామాను ఆయన వెండితెరపై ఆవిష్కరించే విధానం ప్రేక్షకులకు ఒక సాలిడ్ ట్రీట్‌లా ఉంటుందని చెప్పవచ్చు. అల్లు అర్జున్ మేకోవర్ కూడా ఈ కథకు తగ్గట్టుగానే వినూత్నంగా ఉండబోతోంది, ఇది ఆడియన్స్‌కు ఒక సరికొత్త అనుభూతిని ఇస్తుంది. ఈ భారీ బడ్జెట్ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ సన్ పిక్చర్స్ వారు ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. సంగీత ప్రపంచంలో తనకంటూ ఒక గుర్తింపు తెచ్చుకున్న సాయి అభ్యంకార్ ఈ సినిమాకు స్వరాలు సమకూరుస్తున్నారు. అట్లీ మార్క్ మేకింగ్, అల్లు అర్జున్ ఎనర్జీ, అభ్యంకార్ మ్యూజిక్ వెరసి ‘రాకా’ బాక్సాఫీస్ దగ్గర ఎలాంటి రికార్డులను సృష్టిస్తుందో అని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. నేషనల్ వైడ్‌గా ఈ సినిమాపై ఉన్న క్రేజ్ చూస్తుంటే మరో పాన్ ఇండియా సెన్సేషన్ ఖాయమనిపిస్తోంది.

# శరవేగంగా ‘భోగి’ షూటింగ్



‘నారీ నారీ నడుమ మురారీ, బైకర్’ చిత్రాలతో దూసుకుపోతున్న చార్మింగ్ స్టార్ శర్వానంద్ , ‘భోగి’ చిత్రంతో హ్యాట్రిక్ కొట్టేందుకు సిద్ధమవుతున్నారు. ఈ పాన్-ఇండియా పీరియడ్ యాక్షన్ డ్రామా కోసం దర్శకుడు సంపత్ నందితో తొలిసారి శర్వానంద్ చేతులు కలిపారు. శ్రీ సత్యసాయి ఆర్ట్స్ బ్యానర్‌పై కె.కె. రాధామోహన్ నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని లక్ష్మీ రాధామోహన్ సమర్పిస్తున్నారు. ఇది శర్వానంద్ కెరీర్‌లో అత్యంత ప్రతిష్టాత్మక ప్రాజెక్టులలో ఒకటిగా రూపుదిద్దుకుంటోంది. ఇప్పటికే విడుదలైన ప్రమోషనల్ కంటెంట్ సినిమాపై భారీగా అంచనాలను పెంచేసిన విషయం తెలిసిందే. ‘బైకర్’ మూవీ ప్రమోషన్స్ నిమిత్తం తీసుకున్న బ్రేక్ అనంతరం, శర్వానంద్ మళ్లీ ఈ సినిమా షూట్‌లో జాయిన్ అయినట్లుగా మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ప్రస్తుతం ఈ చిత్రం రాజమండ్రిలో అత్యంత కీలకమైన, లెన్తీ షెడ్యూల్‌ను ప్రారంభించిందని, షూటింగ్ రంపచోడవరం అడవులలోని కఠినమైన, సవాలుతో కూడిన ప్రదేశాలలో జరగనుందని, ఇక్కడ ఎక్సయిటింగ్, టఫ్ యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరించనున్నట్లుగా మేకర్స్ ఈ అప్డేట్‌లో తెలిపారు. ఈ సన్నివేశాలను యాక్షన్ కొరియోగ్రాఫర్ ధిలీప్ సుబ్బరాయన్ పర్యవేక్షణలో చిత్రీకరిస్తున్నారు. ఈ షెడ్యూల్‌లో శర్వానంద్‌తో పాటు ప్రధాన తారాగణం మొత్తం పాల్గొంటున్నారని, ఇది సినిమా నిర్మాణానికి కీలక షెడ్యూల్ అని మేకర్స్ ప్రకటించారు. ‘ఎ బ్లడ్ ఫెస్ట్’ అనే ట్యాగ్‌లైన్‌తో రూపుదిద్దుకుంటోన్న ఈ చిత్రంలో శర్వానంద్ ఒక సరికొత్త అవతార్‌లో కనిపించనున్నారు. ఆ విషయం ఇప్పటికే వచ్చిన ఫస్ట్ లుక్ తెలియజేసింది. 1960లో ఉత్తర తెలంగాణ-మహారాష్ట్ర సరిహద్దు నేపథ్యంలో దర్శకుడు సంపత్ నంది ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. వాస్తవికమైన కథనం, పవర్ ఫుల్ నేపథ్యంతో ఈ చిత్రం ఇంటెన్స్ డ్రామాతో గొప్ప ఎక్స్‌పీరియన్స్ ఇవ్వనుందని చిత్రబృందం చెబుతోంది. శర్వానంద్ సరసన అనుపమ పరమేశ్వరన్, డింపుల్ హయాతి హీరోయిన్లుగా నటిస్తున్న ఈ చిత్రానికి భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నారు. రక్షా బంధన్ స్పెషల్‌గా 28 ఆగస్ట్, 2026న తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో గ్రాండ్‌గా థియేటర్లలో రిలీజ్ చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.

# విష్ణుప్రియకు కాసులు కురిపించిన వివాదం.. ఫిర్యాదుతో అమాంతం పెరిగిన ఆదాయం!

డిజిటల్ మీడియా యుగంలో నెగెటివ్ పబ్లిసిటీ కూడా ఒక్కోసారి పాజిటివ్ ఫలితాలను ఇస్తుందనడానికి తాజా ఉదాహరణగా నిలుస్తున్నారు బుల్లితెర నటి, బిగ్‌బాస్ ఫేమ్ విష్ణుప్రియ భీమినేని. అశ్లీల కంటెంట్‌ను ప్రోత్సహిస్తున్నారంటూ ఆమెపై నమోదైన పోలీస్ కేసు, నైతికంగా ఆమెను ఇబ్బంది పెట్టాలనే లక్ష్యంతో చేసినప్పటికీ, ఆర్థికంగా మాత్రం ఊహించని రీతిలో కలిసొచ్చింది. ఈ వివాదం కారణంగా ఆమె నెలవారీ ఆదాయం ఏకంగా రూ.11 లక్షలకు పైగా పెరగడం ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. విష్ణుప్రియ తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో ప్రత్యేకమైన వీడియోల కోసం నెలకు రూ.399 చొప్పున సబ్‌స్క్రిప్షన్ ఫీజు వసూలు చేస్తున్నారు. ఆమెపై విజయవాడ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు అందకముందు, ఆమెకు 1,892 మంది సబ్‌స్క్రైబర్లు ఉండేవారు. దీని ద్వారా ఆమెకు నెలకు సుమారు రూ.7.18 లక్షల ఆదాయం వచ్చేది. అయితే, ఎప్పుడైతే ఆమెపై ఆల్ ఇండియా స్టూడెంట్స్ ఫెడరేషన్ (ఏఐఎస్ఎఫ్) నేతలు ఫిర్యాదు చేశారో, ఈ వార్త మీడియాలో ప్రముఖంగా ప్రసారమైంది. దీంతో ఆమె అప్‌లోడ్ చేసే కంటెంట్‌లో ఏముందో చూడాలనే ఆసక్తి నెటిజన్లలో ఒక్కసారిగా పెరిగింది. ఫలితంగా, కొద్ది రోజుల్లోనే ఆమె సబ్‌స్క్రైబర్ల సంఖ్య 4,832కు చేరింది. తద్వారా ఆమె నెలవారీ ఆదాయం ఇప్పుడు రూ.18.36 లక్షలకు పైగా చేరింది. అంటే, కేవలం ఈ వివాదం వల్ల ఆమె సంపాదనలో రూ.11 లక్షలకు పైగా పెరుగుదల కనిపించింది. విజయవాడ సూర్యారావుపేటలోని సైబర్ క్రైమ్ పోలీసులకు ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం. సాయికుమార్ ఫిర్యాదు చేశారు. విష్ణుప్రియ డబ్బుల కోసం యువతను తప్పుదోవ పట్టించేలా అర్ధనగ్న వీడియోలు పోస్ట్ చేస్తున్నారని, ఆమె ఇన్‌స్టాగ్రామ్ ఖాతాను తక్షణమే బ్లాక్ చేయాలని డిమాండ్ చేశారు. సమాజానికి ఆదర్శంగా ఉండాల్సిన సెలబ్రిటీలు ఇలాంటి పనులు చేయడం సరికాదని వారు విమర్శించారు. అయితే, నైతిక విలువలను కాపాడాలనే ఉద్దేశంతో చేసిన ఈ ఫిర్యాదు, పరోక్షంగా విష్ణుప్రియకు ఉచిత ప్రచారంగా మారింది. ఒక విషయాన్ని ఎంతగా అడ్డుకోవాలని ప్రయత్నిస్తే, దానిపై జనంలో అంతగా ఆసక్తి పెరుగుతుందనే ‘స్ట్రీసాండ్ ఎఫెక్ట్’ ఇక్కడ స్పష్టంగా పనిచేసింది. మొత్తంగా ఈ సంఘటన, విమర్శలే పెట్టుబడిగా మారి నెగెటివ్ పబ్లిసిటీ కూడా సానుకూల ఫలితాలను ఇవ్వగలదని నిరూపించింది.






Edited, Printed, Published & Owned by **LEKKALA SREENU** and Published from D.NO: 4-14/5-201, Revenue Ward NO. 57, Aganampudi, Near Toll Gate, Duvvada, Talarivanipalem,VISAKHAPATNAM, AP-530049 and Printed at **Guddapuvalasa Ramani**, D.No. 18-135/1/1, Opp. Apollo Hospital, Pedagadhili, VISAKHAPATNAM, A.P.-530040. E-mail: Pathakamnews.ap@gmail.com, **Mobile No: 7097975757, Reg No. APTEL/25/A2082**